
తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
సంపుటి : 2 | సంచిక : 284 | బుధవారం | 12 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 www.telanganamuchatlu.in

## గ్రూప్-2 ఫలితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ




**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితా లు మంగళవారం సాయంత్రం విడు దలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొం దుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.




కవితకు నేను ఏంటో చూపించాల్సిన అవసరం ఉంది..
మండలిలో ప్రభుత్వంపై విమర్శలు చేసే విపక్షాలకు సరైనతీరుగా సమాధానం
శాసనమండలిలో కవిత బీసీ వాదం వినిపిస్తున్నారు.
విజయశాంతికి మంత్రిత్వ శాఖ ఇస్తే మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారు ఊరుకుంటారా?

# కవితకు చెక్ పెట్టేందుకు రాములమ్మ..!

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
విజయశాంతిని ఏ విధానంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించారు? దీని వెనక కాంగ్రెస్ పాటించిన విధా నాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధా నాలు ఇప్పుడు తెలుస్తున్నాయి. వీటిని స్వయంగా విజయశాంతే చెప్పారు. ఎమ్మెల్సీగా నామినేషన్ వేయడానికి ఆమె శాసనమండలికి వెళ్లారు. ఆమె వెంట వందల మంది కాంగ్రెస్ కార్య కర్తలు ఉన్నారు. ఈ క్రమంలోనే ఆమె ను మీడియా ప్రతినిధులు కలిసి పలు ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆమె వాటికి స్పష్టమైన సమాధానాలు చెప్పారు.." నన్ను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. శాసన మండలిలో ప్రభుత్వం తరపున నేను మాట్లాడతాను. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. మండలిలో కవితకు సభ్యత్వం ఉంది. నాక్కూడా అందులో ఇప్పుడు సభ్యత్వం లభించింది. నేను ఒక ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చాను. నా వాణి నేను వినిపిస్తాను.. కవిత బీసీ వాదం ఎత్తుకుంటే.. బీసీనైన నన్ను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. మండలిలో ప్రభుత్వంపై విమర్శలు చేసే విపక్షాలకు సరైన తీరుగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాపై కూడా ఉంది. ఒకరకంగా కవితకు నేను ఏంటో చూపిం చాల్సిన అవసరం ఉందని" విజయశాంతి పరోక్షంగా వ్యాఖ్యానించారు. విజయ శాంతిని శాసనమండలికి పంపించడానికి ప్రధాన కారణం.. కవితకు దీటైన నాయకురాలు ఉండాలని.. అందువల్లే కాంగ్రెస్ పార్టీ విజయశాంతిని మండలికి పంపించిందని మీడి యాలో వార్తలు వస్తున్నాయి. ఇక ఇదే సమయంలో విజయశాంతి కూడా కవితకు పోటీ ఇస్తానని చెప్పడం.. నేనంటే చూపిస్తానని వ్యాఖ్యానించడం.. సంచలనం కలిగిస్తోంది. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదలైన అనంతరం కవిత శాసనమండలిలో బీసీ వాదం వినిపిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తు న్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్క మహిళ నాయకురాలు కూడా కవితకు దీటుగా సమాధానం ఇవ్వలేకపోతున్నారు. అందువల్లే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విజయశాంతిని ఎమ్మెల్సీగా నియమించింది అని తెలుస్తోంది. ఇక ఇదే విష యంపై విజయశాంతి కూడా క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి ఒక లక్ష్యం తోనే తనను ఎమ్మెల్సీ చేశారని వ్యాఖ్యానించారు. అయితే ఎమ్మెల్సీగా గెలిచారు కాబట్టి.. మంత్రివర్గం లో అవకాశం దక్కుతుందా అని ఓ మీడియా ప్రతి నిధి ప్రశ్నించగా.. లెట్స్ వెయిట్ అండ్‌సి అని విజ యశాంతి బదులు ఇచ్చారు. అంటే ఈ లెక్కన విజ యశాంతి త్వరలో మంత్రి కూడా కాబోతున్నారని తెలుస్తోంది. అయితే విజయశాంతికి మంత్రిత్వ శాఖ ఇస్తే మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారు ఊరుకుంటారా? అధిష్టానం పై ఆగ్రహం వ్యక్తం చేయరా? అనే ప్రశ్నలు రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.



## కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**
ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్‌నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీ సులను అదేశించింది.కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళ వారం ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## గ్రాడ్యుయేట్లు ఎందుకు ఓటు వేయలేదో..?

**నిజామాబాద్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**
ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవడం నిరాశ కలిగించిందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో నుడా చైర్మన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు, ఉపాధ్యాయులను సీఎం అన్ని విధాలుగా అభివృద్ధి చేసినప్పటికీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించడం నిరాశకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక 56 వేల ఉద్యోగాలు ఇచ్చినా పట్టభద్రులు ఎందుకు ఓటు వేయలేరో అని అనుమానం వ్యక్తం చేశారు.ప్రమోషన్లు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాళ్ల సమస్యలను తీర్చిందని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. అయినప్పటికీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయకపోవడం నిరాశ పరిచిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపై జిల్లా కాంగ్రెస్ నాయకులందరూ కలిసి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు .ఇంకా ఎక్కువగా కష్టపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు వైపు ముందడుగు వేస్తామని తెలిపారు.పసుపు ధర ఒక్కసారిగా పడిపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. పసుపు రైతులు ఆందోళన చెందాల్సిన.. ■ మిగతా 4లో..

## హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదుల వెల్లువ

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**
రహదారులు పార్కులను ఆక్రమించుకుంటు న్నారని ఫిర్యాదు.పాత లేఅవుట్లను చెరి పేసి పొలాలుగా సాగు చేస్తున్నారని ఫిర్యాదులు హైదరాబాద్‌లో అధికారాన్ని ఉపయోగించి కొం దరు నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నా రని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. హైడ్రా నిర్వహించిన ప్రజా వాణిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు లేఅవుట్లలో రహదారుల కబ్జా లు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదులు చేశా రు.ఈ రోజు మొత్తం 63 ఫిర్యాదులు అందా యి. తుర్క యాంజాల్, ప్రతాపసింగారం, బోడు ప్పల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలని సంబంధిత అధికారు లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అధి కారాన్ని అడ్డుపెట్టుకొని మాజీ మున్సి పల్ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు మెం బర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని వివిధ ప్రా ంతాల ప్రజలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక అధికారులు పట్టించు కోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలను సృష్టించి, పాత లేఅవుట్లను చెరిపేసి పంట పొలాలుగా సాగు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో, మండలిలో పోరాడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాల న్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కొట్లాడా లన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు.. విడుదల చేయకపోవడం గురించి.. వైద్య రంగం లో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలపై




ఎండగట్టాలన్నారు. దళితబంధును నిలిపివేయడంపై ప్రశ్నించాల న్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని సభ్యులకు సూచిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాల ను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పిలుపు నిచ్చారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు ఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రజల పక్షాన గట్టిగా పోరాడాలని సమా వేశం నిర్ణయించింది. సభలో ఇంకా ప్రతిభావంతంగా ప్రజాస మస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. ఎల్పీ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ సభ్యులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.



## వారసుల కోసం ఆరాటం

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు :**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, జనగామ డీసీసీ పీఠంపై ఎవరికి దక్కుతుందనేది హాట్ టాపిక్‌గా మారింది. ములుగు జిల్లా అధ్యక్ష పదవి రేసులో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్ష రేసులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీ రెడ్డి ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీరెడ్డికి ఎలాంటి పదవి లేకపోవడంతో నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య వస్తుందట.ములుగు జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం పైడాకుల అశోక్ ఉన్నారు. ఆయన జడ్పీ చైర్మన్ కుర్చీలో కూర్చోవాలని తెగ ఆరాట పడుతున్నాడట. మంత్రి సీతక్కకు కూడా తన మదిలో మాట చెప్పేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా.. ■ మిగతా 4లో..

# దానంతో చేసే దైవారాధన.. జకాత్




**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు విధిగా ఆచరించాల్సిన అంశం జకాత్. జకాత్ అంటే ముస్లింలు తమ ఏడాది సంపాదనలో రెండున్నర శాతాన్ని నిరుపేదల కోసం ఖర్చు పెట్టడం. జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని కూడా అర్థం. జకాత్ నమాజ్ లాగా ముస్లింలు విధిగా ఆచరించాల్సిన ధర్మం. ఈ ధర్మాన్నిఆచరిండం ద్వారా చేసే దైవారాధన అత్యుత్తమమైనది. జకాత్ ద్వారా సంపన్నుల నుంచి వసూలు చేసిన ధనం నిరు పేదలకు పెంచబడుతుంది. సత్యాన్నివిశ్వసించి, జకాత్ విధిని నెరవేర్చేవారికి ఎలాంటి దు:ఖం, భయం ఉండవని ఖుర్ఆన్ ప్రవచిస్తోంది. ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు తమ సంపద నుంచి విధిగా జకాత్ తీసి ఇస్లామీయ ప్రభుత్వానికి చెల్లించాలి. అలాంటి ప్రభుత్వం లేని చోట విధిగా వ్యక్తిగతంగా లేదా సంఘం ద్వారా అర్హులైన వారికి దానాలు చేయాలి. ముస్లింల ప్రాపంచిక వ్యామోహాన్ని నిర్మూలించి, వారి హృదయాల్లో దైవ ప్రేమను మొలకెత్తించేందుకు జకాత్ ను ఏర్పాటు చేశారు. సమాజంలో ప్రజలందరికీ ఆర్థిక న్యాయాన్ని చేకూర్చాలన్న ఉత్తమ లక్ష్యంతో జకాత్‌ను ఏర్పాటు చేశారు. మనుషుల మనుగడ కోసం అల్లా హ్ అనేక సంపదలను ప్రసాదించాడు. అం దుకుగాను మనం అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయన మనకు ఇచ్చిన సంపదల్లో కొంత భాగం పేదలైన తోటి మానవులకు అందించాలి. ధాన్యం, పప్పు గింజలు, కూరగాయలు, పండ్లు..ఇలా భూమిలో పండే పదార్థాలతో పాటు ధన, కనక, వస్తు, వాహన, వస్త్ర, వంట సామాగ్రి ఉత్పత్తులను దానం చేయాలి. ఈ నేపథ్యంలో మన సంపదను జకాత్ ద్వారా సద్వినియోగం చేస్తేనే మనం దైవ ప్రసన్నత పొందుతాము. జకాత్ వల్ల మనలో స్వార్థం, లోభం, అసూయ, ద్వేషం, దోపిడి లాంటి చెడు గుణాలు నిర్మూలించబడతాయి. ప్రేమ, పరోపకారం, త్యాగం, సానుభూతి, సహకారం, స్నేహం, చిత్తశుద్ధి, ఔదార్యం లాంటి సద్గుణాలు పెంపొందుతాయి. జకాత్ ఇస్లాం సౌధానికి మూల స్తంభం. ఇది ఒక ధన సంబంధమైన దైవారాధన!

**జకాత్ ఇవ్వడానికి అర్హతలుండాలి!**
ధనవంతులైన ప్రతి ముస్లిం ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో తప్పని సరిగా పాటించాల్సిన విధి జకాత్. జకాత్ చెల్లించని ధనవంతులను పరమ దుర్మార్గులుగా భావిస్తారు. జకాత్ ఇవ్వడానికి కొన్ని షరతులు, విధి విధానాలను ఏర్పరిచారు. అవి.. జకాత్ ఇచ్చే వ్యక్తి వయోజనుడై ఉండాలి. జకాత్ ఇచ్చేవారు కనీస సంపదలు కలిగిన ధనవంతులై ఉండాలి. సంపద లభించిన ఏడాది తర్వాత దానం చేయాలి. జకాత్ చేసేవారు అప్పులు చేసి ఉండకూడదు. స్థిరాస్తులు, భూములు, నవ రత్నాలు, యంత్రాలను, సొంత అవసరాలకు వాడే వాహనాలను జకాత్ ఇవ్వాల్సిన అవసరం లేదు. పెంపుడు పశువులను కూడా ఖుర్ఆన్ లో నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ ఉంటే జకాత్ ఇవ్వవచ్చు. పంటల ఉత్పత్తుల్లో పది శాతం 'ఉష్ర్' రూపంలో జకాత్ ఇవ్వాలి. అర్హులైన వారికి జకాత్ ఇస్తున్నప్పుడు జకాత్ ఇస్తున్నానని మనస్సులో సంకల్పించుకోవాలి. జకాత్ స్వీకరించే వ్యక్తిని జకాత్ యజమానిగా భావించాలి. జకాత్ స్వీకరించేవారికి కూడా కొన్ని అర్హతలను నిర్ణయించింది ఖుర్ఆన్. వాటి ప్రకారం ఆత్మాభిమానం కలిగిన నిరుపేదలు, ఫకీర్లు, జకాత్ వసూలు చేసే ఉద్యోగులు దానాన్ని స్వీకరించవచ్చు. బానిసల విముక్తి కోసం, అప్పులున్న వారిని రుణ విముక్తుల్ని చేయడం కోసం, నిర్ధనులైన బాటసారులను ఆదుకోవడానికి జకాత్ ధనాన్ని ఖర్చు పెట్టవచ్చు. ధర్మ సంస్థాపన కోసం, ధర్మ ప్రచారం కోసం దైవ మార్గంలో చేసే పనులకు జకాత్ ఖర్చు చేయవచ్చు. సొంత పనులు చేయించుకొని వాటికి ప్రతిఫలంగా జకాత్ ఇవ్వకూడదు. ఏడున్నర తులాల బంగారం లేదా వాటికి తగ్గ విలువైన సంపద ఏడాదిపాటు నిల్వ వున్న ప్రతీ ధనవంతుడూ విధిగా జకాత్ చెల్లించాలని ఖుర్ఆన్ పేర్కొంటోంది.

**- ముహమ్మద్ ముజాహిద్,**
**9640622076**



## ఈద్గా మసీదులలో పారిశుధ్య పనులు నిర్వహించాలి

**- ముస్లిం మైనార్టీ రూరల్ జేఏసీ వినతి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఈద్గా తోపాటు పలు మసీదులలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం ఏదుల పురం మున్సిపాలిటీ కమిషనర్ కు ముస్లిం మైనార్టీ రూరల్ జెఏసి నాయకులు వినతిపత్రం సమర్పించారు. మసీదు పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టటం, బ్లీచింగ్ చల్లడం, మురికి కాల్వలను శుభ్రపరచడం, వీధిదీపాలు వెలిగేలా పర్యవేక్షించడం చేయాలని కోరారు. అదేవిధంగా ఈద్గా ప్రాంతంలో కూడా పారిశుద్ధ పనులు చేపట్టటం తోపాటు పండగ నమాజు రోజు అక్కడ టెంట్లు, నీటి సౌకర్యం ఇతర మౌలిక వసతులు కల్పించాలని ముస్లిం మైనార్టీ రూరల్ జేఏసీ నాయకులు మహమ్మద్ గౌస్ పాష, షేక్ నజురుద్దీన్, షేక్ మస్తాన్, షేక్ అబూబకర్, రషీద్, జబ్బార్, మోహిన్,జాఫర్,రఫీ, మస్తాన్,గౌస్ పాషా,మస్తాన్ ఖాన్ ,షరీఫ్, యాసిన్, హుస్సేన్ తదితరులు వినతి పత్రం సమర్పించే బృందంలో పాల్గొన్నారు.

## రమజాన్ మాసం.. వరాల వసంతం




**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
రమజాన్ మహామాసం వరాలు కురిపించే మాసమని, ఈ నెలలో ప్రతి ఒక్కరూ.. ఎంత వీలైతే అంత సమయం ఖురాన్ తో గడపాలని, ధాన ధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ అన్నారు. నగర శివారు గొల్లగూడెంలోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో ఖత్మే ఖురాన్ వేడుక ఘనంగా జరిగింది. తరావీహ్ నమాజ్‌లో కేవలం తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఖత్మే ఖురాన్ సందర్భంగా దువా చేయడానికి ముందు జరిగిన ఆధ్యాత్మిక సభలో ముఫ్తీ రవూఫ్ ఖాన్ ప్రధాన ఉపన్యాసం చేశారు. మనిషి తన జీవితంలో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం పొంది.. అల్లాహ్ చూపిన మార్గానికి దగ్గరయ్యేందుకు రమజాన్ కు మించిన మాసం మరొకటి లేదన్నారు. ఈ నెలలో ఒక సత్కార్యం చేస్తే.. ఏడు రెట్ల పుణ్యం లభిస్తుందని ఆయన చెప్పారు. అందుకే ఈ మాసాన్ని ప్రతి ఒక్కరూ సత్కార్యాలతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మనిషి ఎప్పటికీ అల్లాహ్‌పై విశ్వాసం కోల్పోవద్దని, ఆయనను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఏది అడిగితే అది పొందవచ్చని అన్నారు. ఖురాన్ పఠనం మాత్రమే పూర్తయిందని.. తరావీహ్ నమాజ్ ప్రతి ఒక్కరూ రమజాన్ నెలంతా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ నమాజ్ లో ఖురాన్ వినడం ప్రతి ఒక్కరికీ.. విధిగా నిర్ణయించబడిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ రమజాన్ ప్రాధాన్యత ను గుర్తించి మెసులుకోవాలని ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ సూచించారు. అంతకు ముందు మదర్సాలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు నగరంలోని పలు ప్రాంతాల ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో అఫ్జల్ హసన్, సయ్యద్ ఇస్మాయిల్, యాకుబ్ పాష, ఖాజా ఖాన్ పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే జంక్షన్ల కూల్చివేతలు

**మంచిర్యాల, తెలంగాణ ముచ్చట్లు :**
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల పట్టణంలో నిర్మించిన జంక్షన్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించిన మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ అనంతరం నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మంచిర్యాల పట్టణంలో రూ. 4 కోట్లతో జంక్షన్లను నిర్మిస్తే కేవలం స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు రాజకీయ కక్ష తో సర్కిల్ కుదింపు నెపంతో జంక్షన్ లను కూల్చివేయడం చాలా దారుణమని నా పై రాజకీయ కక్షతో ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని అన్నారు. పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మి టాకీస్ చౌరస్తా వరకు నిర్మించిన నాలుగు జంక్షన్లను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందిఅయితే వీటిని కుదించడం కోసం చేపట్టిన కూల్చివేతలను సరికాదన్నారు ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రజలే ప్రేమ్ సాగర్ రావుకి బుద్ధి చెప్తారని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పట్టణ నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ సభ్యులందరూ పాల్గొన్నారు.



## పేదప్రజల పక్షపాతి పంది నారాయణ

**- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పేదప్రజల హక్కుల కోసం పోరాడిన పంది నారాయణ చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు నాగిలిగొండ గ్రామంలో సోమవారం కామ్రేడ్ పంది నారాయణ 37వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి భూస్వామ్య గుండాల చేతిలో హతమైన అమరజీవి నారాయణ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యునిస్టుగా మాట గ్రామంలో కూలి లేట్ల పెంపు కోసం, అనేక భూపోరాటాలు నిర్వహించి జైలు జీవితం గడిపారన్నారు. పేద ప్రజలకు భూపంపిణీ, ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటాలను నిర్వహించిన నారాయణను భూస్వామ్య గూండాలు దారుణంగా హత్యచేసారన్నారు. ఆయన మరణం నాగెలిగొండ వరిసర గ్రామల్లో ఒక చైతన్యాన్ని తీసుకువచ్చిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడటమే నారాయణు కు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, మండల కార్యదర్శి పావులూర మల్లిఖార్జున్, నాయకులు వదిమల వెంకటనర్సయ్య, షేక్ చిన్న జాన్, పంది నాగేశ్వరరావు, చాట్ల ముఖర్జీ, విజీర్, భాస్కర్, రమేష్, బోజెడ్ల శేషగిరి పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన సబ్ ఇన్స్పెక్టర్

**హసన్‌పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**



సోమవారం వెలువడిన గ్రూప్ వన్ ఫలితాల్లో వరంగల్ కమిషనరేట్ పరిధి లోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మాధవ్ గౌడ్ 550 మార్కులు సాధించారు. సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్ వన్ పరీక్షలకు పట్టుదలతో సన్నద్ధమై అత్యధిక మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసింది

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసింది విజయశాంతి.
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై విజయశాంతి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఖజానా పూర్తిగా ఖాళీ అయినట్లు విజయశాంతి ఆరోపించారు. తెలంగాణ ఖజానాను కేసీఆర్ ఖాళీ చేసి వెళ్లారు. రాష్ట్రం ఇప్పటికే 7లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయింది, అని ఆమె విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని.ఈ అంశాన్ని తాను గతంలో ఎన్నోసార్లు ప్రస్తావించానని పేర్కొన్నారు.

## ఖమ్మం మధురానగర్‌లో దారుణం..!

- వ్యాపారంలో నష్టపోయిన దంపతులపై ప్రయివేట్ సైన్యం దాడి.
- బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం కోసం కోటి 30 లక్షల అప్పు చేసిన దంపతులు.
- బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఆర్థికంగా దెబ్బతిన్న వ్యాపారి.
- అప్పు ఇచ్చిన ఏఎస్ఐ రాజ్యనాయక్ మధ్యవర్తుల అఘాయిత్యాలు.
- ఇంటిని ఖాళీ చేయించేందుకు ప్రయివేట్ సైన్యం అరాచకం.
- మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులు, ఇంట్లో లూటీ.
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు .. సీసీటీవీ ఫుటేజీ కీలకం.



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం నగరంలోని మధురా నగర్‌లో ఓ వ్యాపార కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వారిని కేవలం అప్పుల ఊబిలోనే కాదు, భౌతిక దాడుల బారిన పడే స్థితికి తీసుకువచ్చింది. తన బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం కోసం కోటి 30 లక్షల అప్పు చేసిన నర్వనేని నరేష్, నైమిషా దంపతులు వ్యాపారంలో నష్టపోయి అప్పు తీర్చలేకపోయారు. అయితే, అప్పు ఇచ్చిన ఏఎస్ఐ రాజ్యనాయక్ తన ప్రయివేట్ సైన్యాన్ని ప్రయోగించి, ఇంటిని ఖాళీ చేయించేందుకు దౌర్జన్యాలకు దిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.

**వివరాల్లోకి వెళ్తే...**
ఖమ్మం మధురా నగర్‌కు చెందిన నర్వనేని నరేష్, నైమిషా దంపతులు బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం నిమిత్తం ఏఎస్ఐ ఆంగోత్ రాజ్యనాయక్ వద్ద నుంచి కోటి 30 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అయితే, వ్యాపారంపై బర్డ్ ఫ్లూ ప్రభావం పడడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో అప్పు తిరిగి చెల్లించలేకపోవడంతో, రాజ్యనాయక్ తమ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.కానీ, ఇది సరిపోదని భావించిన అతడు తన మధ్యవర్తులను రంగంలోకి దింపాడు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ రాజ్యనాయక్ తన అనుచరులను మధురా నగర్‌కు పంపించి, దంపతులను తీవ్రంగా వేధించడానికి ప్రేరేపించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ప్రయివేట్ సైన్యం అరాచకం**
ఇంటిని ఖాళీ చేయాలని దౌర్జన్యంగా బలవంత పెట్టేందుకు రాజ్యనాయక్ అనుచరులు నడుం బిగించారు. ఇదే క్రమంలో ఎనిమిది మంది వ్యక్తులు, ఇద్దరు మహిళలు ఇంట్లోకి ప్రవేశించి విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. మహిళను ఇంటి మొదటి అంతస్తు నుంచి బలవంతంగా ఈడ్చుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన దుండగులు, ఇంట్లో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారు.

**బాధితుల గోడు ..పోలీసులకు ఫిర్యాదు**
ఈ దాడి నుంచి హుటాహుటిన తప్పించుకున్న నర్వనేని దంపతులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని, దుండగుల బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ దాడికి సంబంధించిన మొత్తం ఘటన సీసీటీవీ ఫుటేజీలో నమోదు కాగా, పోలీసులు దీనిని పరిశీలిస్తున్నారు.

**పోలీసులపై ప్రశ్నలు ..న్యాయం కోరుతున్న బాధితులు..**
స్వయంగా ఓ పోలీసు అధికారి అప్పు ఇచ్చి, తన పదవీ హోదా దుర్వినియోగం చేస్తూ బాధితులను వేధించడానికి ప్రయత్నించడం సంచలనంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగి హోదాలో ఉన్న వ్యక్తి ఈ విధంగా ప్రైవేట్ సైన్యం ఏర్పాటు చేసుకుని బెదిరింపులకు దిగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. న్యాయపరంగా తమకు రక్షణ కల్పించాలని, తగిన చర్యలు తీసుకోవాలని నర్వనేని దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు ఎలా స్పందిస్తారనే దానిపై అందరి దృష్టి నిలిచింది.

**కేసు దర్యాప్తుపై ఉత్కంఠ**
ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలు పోలీసుల చేతికి వెళ్లడంతో, దర్యాప్తు వేగంగా సాగే అవకాశముంది. ఏఎస్ఐ రాజ్యనాయక్ పాత్ర ఏమిటి?ప్రయివేట్ సైన్యంగా వ్యవహరించిన దుండగులెవరు?బాధితులకు న్యాయం జరిగేనా? అన్న ప్రశ్నలకుసమాధానాలు త్వరలోనే వెలువడనున్నాయి.

## ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉంది

**అమరావతి, తెలంగాణ ముచ్చట్లు :**
ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. 2014-2019 కాలంలో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులు మరియు నిధుల వినియోగం వంటి ముఖ్య అంశాలపై స్పష్టమైన సమాచారం అందించారు. 2014-2019లో నిర్మించిన అంగన్వాడీ భవనాలు మొత్తం 12,496 అంగన్వాడీ భవనాలు నిర్మించబడ్డాయి.వీటిలో 6,161 భవనాలు పూర్తయ్యాయి, ఇంకా కొన్ని భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి.3,154 భవనాలకు పునరుద్ధరణ, మరమ్మతుల నిధులు కేటాయించబడ్డాయి.వీటికి రూ. 111 కోట్లు ఖర్చు చేయబడింది.అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి.ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నిర్మాణ పనులు పూర్తయ్యాయి.అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి, బాలల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ముఖ్యమంత్రి నాయకత్వంలో, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం" అని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# నియంతృత్వంపై పోరు

-జర్నలిస్టుల ఐక్యత చాటుతాం
-ఇండ్ల స్థలాల సాధనకు ఉద్యమం
-టీడబ్ల్యూజేఎఫ్ లో భారీగా చేరికలు
-సభ్యత్వ నమోదుకు భారీ స్పందన
-ఖమ్మంలో జర్నలిస్టుల బైక్ ర్యాలీ.. అంబేద్కర్ కు నివాళి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మంలో జర్నలిస్టులు కదం తొక్కారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు సభకు విశేష స్పందన లభించింది. దాదాపు 300కు పైగా జర్నలిస్టులు తరలి వచ్చి సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. వివిధ జర్నలిస్టు యూనియన్ల నుంచి టీడబ్ల్యూజేఎఫ్‌లో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు చేరారు. దీనికి ముందు ఖమ్మంలోని కాల్వొడ్డు జూబ్లీ క్లబ్ నుంచి రోటరీ నగర్ లోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ వరకు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జూబ్లీ క్లబ్ వద్ద ఈ ర్యాలీని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ సెంటర్ మీదుగా జడ్పీ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టులు నివాళి అర్పించారు. తిరిగి ప్రారంభమైన మోటార్ బైక్ ర్యాలీ ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా రోటరీ నగర్ లోని సభాస్థలికి చేరుకుంది. సభా ప్రారంభానికి ముందు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జక్కంపూడి కృష్ణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో మృతి చెందిన జర్నలిస్టులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండలరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు రాజశేఖర్, పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్‌లో నూతనంగా చేరిన సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, ఎగినాటి మాధవరావు, మానుకొండ రవి కిరణ్, కొత్త యాకేష్, కూరాకుల గోపీ, జానీపాష, తాళ్ళూరి రమేష్, పెంద్ర అంజయ్య, రాంపుడి నాగేశ్వరరావు, కొమెర వెంకటేశ్వర్లు, మధుశ్రీ, సంజీవరావు, సుభానీ, మాధవరావు, అయ్యప్ప తదితరులు ప్రసంగించారు. మొత్తం 196 మందికి పైగా జర్నలిస్టులు తొలిరోజు సభ్యత్వం తీసుకున్నారు. మొత్తం 285 మంది జర్నలిస్టులు సభకు హాజరయ్యారైనట్లు పేర్లు నమోదు చేసుకున్నారు.

**నియంతృత్వంపై పోరు : బసవ పున్నయ్య**
ఓ రెండు జర్నలిస్ట్ యూనియన్లు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి వత్తాసు కొడుతూ.. జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపునయ్య ఆరోపించారు. నాయకులుగా లబ్ధి పొందుతూ.. జర్నలిస్టుల సమస్యలపై స్పందించకుండా... నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పోరాడే టీడబ్ల్యూజేఎఫ్ ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కొందరు నాటి, నేటి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలను గాలికి వదిలి ప్రభుత్వాల వద్ద సైంధవుల పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. యూనియన్ నిర్మాణపరమైన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇంత భారీగా తరలివచ్చి సభ్యులుగా చేరిన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



**ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం: మామిడి సోమయ్య**
జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హామీ ఇచ్చారు. నియంత పోకడలను వ్యతిరేకిస్తూ 2006లో ఫెడరేషన్ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి నేటి వరకు టీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న పోరాటాలను జర్నలిస్టులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. జర్నలిస్టుల ప్రతి సమస్యపై నికరంగా పోరాడేది ఒక్క టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అన్నారు. ఖమ్మంలో ఇంత భారీ సంఖ్యలో జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరటం హర్షనీయమని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో ఖమ్మం జర్నలిస్టులను మభ్య పెట్టే రీతిలో కొందరు వ్యవహరించారని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ ఆరోపించారు. వాస్తవాలను జర్నలిస్టులకు వివరించి వారిలో చైతన్యం తీసుకొచ్చేలా టీడబ్ల్యూజేఎఫ్ వ్యవహరించిందని పేర్కొన్నారు.

వందల సంఖ్యలో సభ్యత్వం తీసుకొని టీడబ్ల్యూజేఎఫ్ ను బలోపేతం చేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకూ యూనియన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**రియల్ ఫైటర్స్ : ఎస్డీ ఖదీర్, దువ్వా సాగర్**
జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పోరాడే రియల్ ఫైటర్స్ టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరేందుకు ముందుకు రావడం గర్వకారణం అని నూతనంగా యూనియన్‌లో చేరిన సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ వ్యాఖ్యానించారు. ప్రశ్నించే తత్వం ఉన్న జర్నలిస్టులను కొన్ని యూనియన్లు తట్టుకోలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. వృద్ధ జంబూకాలున్న ఆ రెండు యూనియన్ల నేతలు జర్నలిస్టుల ప్రయోజనాల కన్నా సుప్రయోజనాలకే విలువనిస్తున్నారని వ్యాఖ్యానించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా.. ఏ సమయంలోనైనా ఫోన్ చేస్తే ఇట్టే వచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం టీడబ్ల్యూజేఎఫ్ చేరే జర్నలిస్టులకు కండువాలు కప్పి స్వాగతించారు. రాష్ట్ర నాయకులకు జిల్లా కమిటీతో పాటు నూతన సభ్యులు శాలువాలు కప్పి పూల మొక్కల ఇచ్చి సన్మానించారు. నాయకులంతా ఐక్యతను చాటుతూ చేయి చేయి కలిపి సమిష్టి అభివాదం చేశారు. సభ ప్రారంభానికి ముందు యూనియన్ కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు అతిథులను వేదిక మీదకు ఆహ్వానించారు. చివరిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ వందన సమర్పణ గావించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాగుల్ మీర, విష్ణు, శ్రీధర్, రామకృష్ణ నాయక్, నాగమణి, రామచంద్రమూర్తి, పాష, అర్షద్, ఉపేందర్, ఫయాజ్, శరత్, సతీష్, రిషి, మూర్తి, నర్సింహారావు, శ్రీను, సాగం పాల్గొన్నారు.

## నేడు ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
శారీరక వైకల్యం గల చిన్నారులకు ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహణ బుధవారం ఉదయం 10గంటల నుండి మన చింతకానిమండల (చింతకాని మండలం) పరిధిలోని లచ్చగూడెం హై స్కూల్ ప్రాంగణంలోఉన్న దివ్యాంగ బాలబాలికల భవితా కేంద్రంలో సంవత్సరం లోపు వయసుగల దివ్యాంగ చిన్నారుల నుండి 19 సంవత్సరంలముల లోపు వరకు వయసు గల శరీరకవైకల్యం కలిగి ఉన్నఈ క్రింది సమస్యలు, పుట్టుకతోనే వచ్చే ఫాక్షిక పక్షవాతం(సెరిబ్రల్ పాలసీ), శరీరంలోని కండరాల మధ్య సమన్వయ లోపంతో బాధపడుతూ కూర్చోడంలోనూ నిలబడడంలోనూ అడుగులు వేయడంలోనూ, ఇబ్బంది పడే చిన్నారులకు, మరియు ఇతర శారీరక వైకల్యాల వల్ల తమ పనులు తాము చేసుకోలేని చిన్నారులకు తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో, మరియు చింతకాని మండల విద్యాశాఖ అధికారి వీరపునేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహిస్తున్నాము, దీనికి మన మండల పరిధిలోని శారీరక దివ్యాంగ బాలబాలికలను వారి తల్లిదండ్రులు ఈ ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి తీసుకొని వచ్చి దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము. ఇది పూర్తిగా ఉచిత సర్వీస్ దీనికి మీరు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు గమనించగలరు. మరింత సమాచారం కొరకు కే.ఎస్. కృష్ణారావు ఐఆర్పి చింతకానిమండలం, 6302504078, 94922 44874, భూక్య దస్లి ఐఆర్పి, చింతకాని మండలం 9701611 706, మరియు ఫిజియోథెరపీ వైద్య నిపుణురాలు డాక్టర్ జి వసంత 9618608929,ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరములు తెలుసుకోనగలరు.

## క్యాతంపల్లి ఎంపిపిఎస్‌లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
క్యాతంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా విద్యార్థులే?? బాధ్యతలు స్వీకరించి, తరగతులను నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారిగా సి.హెచ్. అశ్విని, మండల విద్యాశాఖాధికారిగా డాక్టర్ బి. రాంధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కే. అనుపాల్, హెడ్మాస్టర్‌గా కే. సంతోష్, పాఠశాల పీఈటీగా కే. ధనవంశి తదితర విద్యార్థులు వ్యవహరించారు.సమాప్తి సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండ రమేష్ అధ్యక్షత వహించగా, పెద్ద పెండ్యాల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి. రాజేందర్, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ మల్లారెడ్డి, తాటికాయల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర రెడ్డి, జానకిపురం ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, కేశవనగర్ ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని సమర్థవంతమైన కార్యక్రమాలు చేపట్టాలని పాఠశాల ఉపాధ్యాయ బృందం భావిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆత్మకూరి రామకృష్ణ, బి. కిషన్, ఇన్నారెడ్డి, కేశవరెడ్డి, మాధవి, సంపత్, సి.ఆర్పి ఎర్ర రణూప పాల్గొన్నారు.

## 40 నెలల్లో ఎస్టీపీపీ 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ పూర్తి చేయాలి

**మంచిర్యాల, తెలంగాణ ముచ్చట్లు :**
జైపూర్ వద్ద గల 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బి.హెచ్.ఇ.ఎల్.)తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున సీఎండీ ఎన్.బలరామ్‌తో పాటు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పీ అండ్ పీ) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బి.హెచ్.ఇ.ఎల్. నుంచి జనరల్ మేనేజర్ మరియు హెడ్ పార్థసారథి దాస్, జీఎం జోగేష్ గులాటి, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. గరిష్టంగా నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ, 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలన్నారు. ఇచ్చిన షెడ్యూల్‌లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరిత గతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ జీఎం అండ్ హెడ్ శ్రీ పార్థసారథి దాస్ మాట్లాడుతూ.. సింగరేణి పవర్ ప్లాంట్ను అతి ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించింది.

## ఆర్బీఐ, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో డిజిటల్ పేమెంట్స్‌పై ఖాతాదారులకు అవగాహన

-సామాజిక భద్రత బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి
-సైబర్ మోసాలపై 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయండి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమందడి ఏపీజీవీబీ బ్యాంకులో ఖాతదారులకు డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ చిత్రం కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలో గల మహిళా సంఘాల సభ్యులు హాజరై డిజిటల్ పేమెంట్స్ గురించి తెలుసుకున్నారు.. ఆర్‌బిఐ అధికారులు అజయ్ మణికంఠ హర్షవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు టీజీబీ మేనేజర్ జ్ఞానేశ్వర్ గౌడ్ రీజినల్ ఆఫీస్ స్వామి జిల్లా అరుణ్ క్రాంతి దక్షిణ రెడ్డి మహిళా సమాఖ్య ఏపిఎం నాగమణి మహిళలకు డిజిటల్ పేమెంట్‌పై అవగాహన కల్పించారు. సందర్భంగా మణిశంకర్ అజయ్ మాట్లాడుతూ.. బ్యాంకు అందించే వివిధ రకాల సేవలు గురించి వివరించారు. మొబైల్ బ్యాంకింగ్. మరియు ఇంటర్నెట్ బ్యాంకింగ్. లావాదేవీల గురించి వివరించారు ఏటీఎం రూపే కార్డులను వాడి సమయాన్ని ఆదా చేసుకోవాలని వారు సూచించారు మోసపూరిత కాల్స్ వస్తే నమ్మవద్దని డబ్బులు పోగొట్టవు కోవద్దని వారు సూచించారు 1930 నెంబర్ కి కంప్లైంట్ చెయ్యాలని సైబర్ లావాదేవీల గురించి తెలుసుకోవాలన్నారు. సామాజిక భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి. బీమా యోజన. బీమా సంరక్ష యోజన. అటల్ పెన్షన్ యోజన. పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఖాతాదారుడు అప్రమత్తంగా ఉండాలని తెలియని లింకులను క్లిక్ చేయవద్దని అపరిచిత లింకులు ఎస్ఎంఎస్‌ల జోలికి వెళ్ళవద్దు అని సూచించారు. తెలివిగా మసులుకొని అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పెట్టుబడి చిత్కలునమ్మవద్దు అన్నారు అపరిచిత కాల్స్‌ను ధ్రువీకరించుకోవాలని వారు సూచించారు ఆన్లైన్ లోన్ యాప్‌ల వంటి స్కీముల పట్ల జాగ్రత్త వహించాలని బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు మరొకరికి రుణాలు అందించే విధంగా బ్యాంకు అధికారులకు ఖాతాదారులు సహకరించాలని వారు సూచించారు.

## కుల గణన చేపట్టడం చారిత్రాత్మకం

- విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి

**పెద్దపల్లి ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడం చారిత్రాత్మకమని విశ్వబ్రాహ్మ ణ-విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ 'మేము ఎంతో మాకు అంతా' అనే నినాదంతో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించడం హర్షణీయమన్నారు.గత నాలుగు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా నని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వివాదాల జోలికి పోకుండా రాష్ట్ర నాయకులతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించి నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు, జిల్లా గౌరవ అద్యక్షులు ముల్కల గోవర్ధన్ శాస్త్రీ, జిల్లా ప్రదాన కార్యదర్శి రామగిరి రాజమౌళి, వరంగల్ జిల్లా అద్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, పట్టణ అద్యక్షుడు నాగులమల్యాల ప్రసాద్, అబ్బోజు కోటయ్య, నూతి రవిందర్ చారి, గర్రెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ అమలయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి



**- ఎమ్మార్పీఎస్ డిమాండ్**

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1, 2, 3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్సటెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాల ఫలితాల విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకముందే నియామక ప్రక్రియ చేపట్టడాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో ధర్మసాగర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించకుండానే ఉద్యోగ నియామకాలను ప్రకటించడం మాదిగలను మోసం చేయడమేనని ఆరోపించారు. గౌరవ జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా, సభలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అవసరమైతే ఇప్పటికే జరిగిన నియామకాల ఫలితాల్లోనూ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ హామీని విస్మరించి గ్రూప్-1, 2, 3 ఎక్స టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాల ఫలితాలను విడుదల చేయడం మాదిగలను మోసం చేయడమేనని ఆరోపించారు. "వర్గీకరణ అమలైన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి" అంటూ ముఖ్యమంత్రి తన మాట నిలబెట్టుకోవాలని, పునరాలోచించాలని కోరారు.




## కొత్త ఎమ్మెల్సీలంతా
# నల్గొండ వాళ్లే!

**నల్గొండ, మార్చి 11, (న్యూస్ 10) :**
తెలంగాణలో రాజకీయాలు విచిత్రంగా ఉన్నాయి. తెలంగాణ విషయంలో పార్టీల ఆలోచనలు ఒకేలా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ సీట్లకు ఒకే జిల్లాకు చెందిన నలుగుర్ని ఆయా పార్టీలు ఎంపిక చేశాయి. ఒక విధంగా చెప్పాలంటే ఆ జిల్లాకు రాజకీయ పార్టీలు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాయో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఎట్టకేలకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు సోమవారం చివరి తేదీ కావడంతో ప్రధాన పార్టీలు తమ తమ అభ్యర్థులను ఆదివారం సాయంత్రం ప్రకటించారు. పుకార్లుకు ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకుండా బీఆర్ఎస్ ఒకరు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు, సీపీఐ నుంచి ఒకర్ని ఎంపిక చేశారు. ఐదుగురు అభ్యర్థులు సోమవారం ఉదయం తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. పోటీ లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాయి అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు. పార్టీలు ప్రకటించిన ఐదుగురు అభ్యర్థుల్లో నలుగురు అభ్యర్థులు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందినవారు ఉన్నారు. కేవలం విజయ శాంతి మినహా ఆ నలుగురు ఆ జిల్లాకు చెందినవారే. గతంలో ఇలాంటి సందర్భం ఎప్పుడూ రాలేదన్నది కొందరు రాజకీయ నేతల మాట. దీనిబట్టి ఆ జిల్లాకు ఎంత ప్రయార్టీ ఇస్తున్నారో అర్థమవుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వారు. ఒకరు దామరచర్ల మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్. ఎస్టీ కోటాలో ఆయన్ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది ఏఐసీసీ. మరో అభ్యర్థి అద్దంకి దయాకర్ కూడా ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి. ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన వ్యక్తి. మాల మహానాడు నేతగా గుర్తింపు పొంది కాంగ్రెస్‌లో చేరారు. రెండుసార్లు తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే గత ఎన్నిక ల్లో ఆయన తన సీటును త్యాగం చేశారు. దీంతో ఆయన కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది కాంగ్రెస్ పార్టీ. అసెంబ్లీ ఎన్నికల ముందు కుదిరిన ఎన్నికల పొత్తులో భాగంగా ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించింది కాంగ్రెస్ పార్టీ. సీపీఐ అభ్యర్థి కూడా నల్గొండ జిల్లా వ్యక్తికే. సీపీఐ ఆ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న నెల్లికంటి సత్యం శాసన మండలిలో అడుగు పెట్టడం లాంఛనమే అయ్యింది. మునుగోడు మండలం ఎలగలగూడేనికి చెందినవారాయన. సీపీఐలో దిగువ స్థాయి నుంచి జిల్లా కార్యదర్శి వరకు ఎదిగారు. గత ఎన్నికల్లో మునుగోడు అసెంబ్లీ స్థానం కోసం పట్టుబట్టింది. అప్పుడు ఒప్పందం ప్రకారం సీపీఐ వెనక్కి తగ్గింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఆ పార్టీ మండలిలో అడుగు పెట్టనుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన ఏకైక అభ్యర్థి దాసోజు శ్రవణ్ కుమార్. ఆయన కూడా నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి. విద్యార్థి దశ నుంచే ఆయన క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. దీంతో కారు పార్టీ ఆయనకు అవకాశం ఇచ్చింది. మొత్తానికి తెలంగాణలో జరుగుతున్న పరిణామాలకు చూస్తుంటే నల్గొండ జిల్లాపై ప్రధాన పార్టీలు గురిపెట్టినట్టు కనిపిస్తోంది.

# తీన్మార్ మల్లన్న కోసం హరీష్ రావు ఆపరేషన్!



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణలో ప్రాంతీయవాదం ముగిసి కులవాదం పడక విప్పడంతో, ఇప్పుడు అన్ని పార్టీల్లోనూ బీసీ నినాదం బాగా వినిపిస్తోంది. 2028 తెలంగాణ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి వచ్చింది. తెలంగాణలో ప్రాంతీయవాదం ముగిసి కులవాదం పడక విప్పడంతో, ఇప్పుడు అన్ని పార్టీల్లోనూ బీసీ నినాదం బాగా వినిపిస్తోంది. 2028 తెలంగాణ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి వచ్చింది. దీంతో తెలంగాణలో బీసీ కులాల నాయకులకు డిమాండ్ పెరుగుతోంది. బీసీ నినాదం ఎత్తుకొని రెడ్లను, కాంగ్రెస్ నేతలను నానా బూతులు తిట్టిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ను ఆకట్టుకునే పనిలో పడింది బిఆర్ఎస్. ఈ విషయంలో చాలా వేగంగా పావులు కదిపిన కెసిఆర్, హరీష్ రావు ద్వారా మల్లన్న చుట్టూ కొందరు బిఆర్ఎస్ బీసీలను ప్రవేశపెట్టారు. తద్వారా మూడు ఏళ్ల ముందే చింతపండు నవీన్‌ని ఫిక్స్ చేసే వ్యూహం పన్నింది బిఆర్ఎస్ పార్టీ. ఎవరు మాటలెక్కువ మాట్లాడగలుగుతారో, ఎవరు మాటలతో ప్రత్యర్థుల్ని చీల్చి చెండాడగలుగుతారో వాళ్లే తెలంగాణలో రాజకీయం చేయగలుగుతారు. మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండదు. నాయకుడు అనే వాడు ఏం చేసినా చేయకపోయినా అద్భుతంగా మాట్లాడితే చాలు తెలంగాణలో పొలిటికల్ లీడర్‌గా సెటిలైపోవచ్చు. కెసిఆర్ అడ్వాంటేజ్ కూడా అదే. అద్భుతమైన మాటకారి అయిన చంద్రశేఖర రావు ఆ మాటలతోనే ఉద్యమం నడిపాడు, ఆ మాటలతోనే పది ఏళ్ల పాలన చేశాడు. ఇదే ఫార్ములా ఫాలో అయ్యి రేవంత్ రెడ్డి కూడా టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యాడు. చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న మీడియాలో ఓ చిన్న ఉద్యోగాన్ని వదులుకొని ఈ నోరు పెట్టుకునే ఏకంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ కూడా అయ్యాడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ ఓటమికి పది కారణాల్లో తీన్మార్ మల్లన్న కూడా ఒకడు. కెసిఆర్ కుటుంబంపై మల్లన్న నెగిటివ్ ప్రచారం ఎన్నికల్లో కాంగ్రెస్ కి చాలా ఉపయోగపడింది. అప్పటి పిసిసి అధ్యక్షుడు, ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా మల్లన్నకు ఫండింగ్ చేసి, ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి నిత్యం కెసిఆర్ ని తిట్టిస్తూ ఉండేవారు. ఈ విషయం కాంగ్రెస్ పార్టీ నేతలే చెప్తున్నారు. తీన్మార్ మల్లన్న అనే అనామకుడికి అన్ని రకాలుగా సహకరించి ఎమ్మెల్సీ స్థాయికి తీసుకొచ్చింది రేవంత్ రెడ్డి. ఎమ్మెల్సీ అయ్యాక చింతపండు నవీన్ కాంగ్రెస్‌కి అడ్డం తిరిగాడుబీసీ నినాదం ఎత్తుకొని రెడ్లను నానా బూతులు తిట్టడం మొదలెట్టాడు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చాలామంది రేవంత్‌ని నిందిస్తున్నారు. తీన్మార్ మల్లన్న అనే వాడిని తయారు చేసింది రేవంత్. ఇప్పుడు అతనే కాంగ్రెస్ పరువు తీస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న పై దాడులు చేయించి, కేసులు పెట్టించి, జైల్లో వేసి నా నా రకాలుగా హింసించిన కేసీఆర్?. ఇప్పుడు హఠాత్తుగా వ్యూహం మార్చాడు. చింతపండు నవీన్ కాంగ్రెస్ కి అడ్డం తిరగ గానే?. అతన్ని తన వైపు లాక్కోవాలని నిర్ణయించాడు కేసీఆర్. ఆ పనిని హరీష్ రావుకు అప్పజెప్పాడు. హరీష్ రావు అనుచరుల్లో కొందరు బీసీలు వెంటనే మల్లన్న చెంతకు చేరారు. తెలంగాణలో ఇక ప్రత్యేక రాష్ట్ర వాదన పనిచేయదని, ఆంధ్రా వాళ్ళని తిట్టి తెలంగాణలో ఓట్లు వేయించుకునే ప్లాన్ ఇప్పుడు ఇక వర్క్ అవుట్ కాదని, రాబోయే రోజుల్లో జనాన్ని కులం పేరిట డివైడ్ చేయాల్సిన అవసరం ఉందని, అందుకే బీసీ నినాదం ఎత్తుకోవడం ద్వారా జనాభాలో అత్యధికంగా ఉన్న వారి ఓట్లను కొల్లగొట్టాలని పార్టీలు డిసైడ్ అయ్యాయి. నీలో భాగంగానే హరీష్ రావు అనుచరులు కొందరు తెలివిగా మల్లన్న పక్కన చేరారు. ఒకప్పుడు కెసిఆర్ ఆఫీసులో పనిచేస్తూ?. అవినీతి ఆరోపణలపై గెంటి వేయబడిన ఒక బి ఆర్ ఎస్ బీసీ కార్యకర్త ఏకంగా ఇప్పుడు మల్లన్న పక్కన చేరాడు. అతనితోపాటు మరికొందరు బీసీ మాస్క్ తో తీన్మార్ మల్లన్న నీ కవర్ చేస్తున్నారు. అలాగే చింతపండు నవీన్ మూమెంట్స్ అన్ని ఎప్పటికప్పుడు హరీష్ రావుకు చేరవేస్తున్నారు. బీసీ ఉద్యమానికి కావలసిన నిధులు సమీకరించడం, ఇతరత్రా సహకారం బి ఆర్ ఎస్ ద్వారానే అందుతోంది. నవీన్ పక్కనబి ఆర్ఎస్ కార్యకర్తలు, హరీష్ రావు అనుచరులను చూసి తెలంగాణ బీసీ నాయకులు షాక్ తిన్నారు. పదేళ్ల కెసిఆర్ కుటుంబ పాలన్నీ, కెసిఆర్ అవినీతిని ఎండగట్టి.. ఆ కేసుల్లో జైలు కెళ్ళి? చివరికి మల్లన్న ఇలా వాళ్లతోనే చేతులు కలవడం చూసి ఆశ్చర్యపోతున్నారు. బీసీ సభలకు, ఇతరత్రా కార్య కలాపాలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఇప్పుడు అర్థమైంది .కాంగ్రెస్ కి వ్యతిరేకంగా కెసిఆర్ ఈసారి బీసీలను రెచ్చగొట్టి?. మల్లన్న ద్వారానే ఆ పని చేయిస్తున్నాడనేది చాలామంది చర్చించుకుంటున్నారు. ఏ ఆయుధాన్ని అయితే రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కేసీఆర్ పై ప్రయోగించాడో, అదే ఆయుధాన్ని ఇప్పుడు కేసీఆర్ కాంగ్రెస్ పై ప్రధానంగా రేవంత్ రెడ్డిపై ప్రయోగించబోతున్నారు. తీన్మార్ మల్లన్న రేవంత్ ఉచ్చు నుంచి బయటపడి కెసిఆర్ ఉచ్చులో చిక్కుకున్నాడు.

# రీల్ స్టార్‌గా జగ్గన్న

**మెదక్, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ కాంగ్రెస్‌లో జగ్గారెడ్డి ఓ విలక్షణ నేత. పాలిటిక్స్‌లో జగ్గారెడ్డి రూటే సెపరేటు. ఆయన ఏం మాట్లాడినా పాలిటిక్స్‌లో హాట్ టాఫిక్ అవుతుంది. ప్రత్యర్థులతో పాటు కొన్ని సందర్భాల్లో సొంత పార్టీ నేతలపై మాటల తూటాలు పేల్చుతుంటారు. పొలిటికల్‌గా హల్‌చల్ చేసే జగ్గారెడ్డి ఆల్ ఆఫ్ సడెన్ సినిమా రంగంలోకి ఎంట్రీ ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. ఇలా డిసైడ్ అయ్యారో లేదో అప్పుడే పోస్టర్ కూడా రిలీజ్ చేసేశారు. పొలిటికల్ టాపిక్స్‌తో నిత్యం వార్తల్లో నిలిచే జగ్గారెడ్డి లైఫ్ స్టైల్ కాస్త డిఫరెంట్ అనే చెప్పొచ్చు. తూర్పు జయప్రకాశ్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి. సీనియర్ మోస్ట్ లీడర్. వైఎస్ హయాం నుంచి ఇప్పుడు రేవంత్ పీరియడ్ వరకు జగ్గారెడ్డి పొలిటికల్ స్టైలే వేరు. ఆయన మాట తీరే సెపరేటు. రాష్ట్రస్థాయిలో ఏ పోస్టులో ఉన్నా సంగారెడ్డిలో జగ్గన్న హల్‌చల్ మాత్రం మామూలుగా ఉండదు. ఏ పండుగ, పబ్బం వచ్చినా ఆర్థికంగా చెప్పుకోదగ్గ ధనవంతుడు కాకపోయినా లక్షలు దారబోసి ఉత్సవాలు చేస్తుంటారు. నార్మల్ పబ్లిక్‌తో కలిసి సంబరాల్లో తానే ముందుంటారు. బోనాలు అయినా.. దసరా ఉత్సవాలను హోరెత్తిస్తారు. శివరాత్రి పర్వదినాన జాగారం, పూజలు, రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. స్వయంగా శివభక్తుడైన జగ్గారెడ్డి..పాటలు పాడుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. రంజాన్ సందర్భంగా తన నియోజకవర్గంలోని ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు గురించి మాటల్లో చెప్పలేము? అంత గ్రాండ్‌గా ఏర్పాట్లు ఉంటాయి. ఇలా ప్రతీ విషయంలో జగ్గారెడ్డి అంటే ఒక రేంజ్‌లో హడావిడి ఉంటుంది. ఇలా పొలిటికల్ లీడర్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు తన మార్క్ స్టైల్‌తో పబ్లిక్‌ను ఆకట్టుకుంటారు జగ్గన్న. అయితే ఇన్నిరోజులు పొలిటికల్ స్క్రీన్ మీద తన హవా భావాలు పలికించిన జగ్గారెడ్డి..ఇప్పుడు వెండితెర మీద కనిపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించేశారు జగ్గన్న. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆఫ్ ది రికార్డ్‌లో చెప్పారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి పాత్రను పోషించాబోతున్నారట జగ్గారెడ్డి. ఈ మధ్య ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉందని చెప్పారంటున్నారు. ఆ కథలో తన పాత్ర ఉందని అని చెప్పడంతో..నటించేందుకు ఓకే చెప్పారట జగ్గన్న. ఈ కథలో తన ఒరిజినల్ క్యారక్టర్ కూడా ఉండబోతుందని అంటున్నారు జగ్గారెడ్డి. ఈ ఉగాదికి సినిమా కథ విని..వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తామని అం టూనే.. పనిలో పనిగా పీసీసీ చీఫ్, సీఎం అనుమతి తీసుకొని నటిస్తానంటూ..అప్పుడే పర్ఫామెన్స్ స్టార్ట్ చేశారు జగ్గారెడ్డి. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేసిన ఆయన..జగ్గారెడ్డి ఎవార్ ఆఫ్‌లవ్ అనే టైటిల్‌తో మూవీ వస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో ఫుల్ బిజీగా ఉండే జగ్గారెడ్డి..ఎవరికి అంత ఈజీగా టచ్‌లోకి రారు. ఎవరికి ఫోన్‌లో అందు బాటులోకి రారు. ఆయన మాట్లాడాలను కుంటేనే ఎవరికైనా టచ్‌లోకి వెళ్తుంటారు. ఇప్పుడు సినిమాలోకి ఎంట్రీ ఇస్తున్న జగ్గారెడ్డి. .ఎంట్రీ కూడా ఓ లెవల్‌లో ఉంటుందన్న చర్చ జరుగుతోంది. జగ్గారెడ్డి..ది వార్ ఆఫ్ లవ్ అంటూ సినిమా ఎలా ఉండ బోతుందనేది చెప్పకనే చెప్పారు. సినిమా పూర్తిగా తన నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందని.. సినిమాలో లవ్ ఎపిసోడ్ ఉంటుందంటున్నారు జగ్గారెడ్డి. అంశాలు ఉంటాయని చెబుతున్నారు

# కిష్టారం సింగరేణి సైలో బంకర్ మూసివేయాలి

**-అంబేద్కర్ నగర్ వాసుల సమస్యలపై తక్షణమే స్పందించాలి**
**- పొంగులేటి సుధాకర్ రెడ్డి**

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**
కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్ వాసులు సింగరేణి డామేజ్ సైలో బంకర్ కారణంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి అతి సమీపంలో నిర్మించిన ఈ సైలో బంకర్ నుంచి వెలువడే దుమ్ము, ధూళి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇన్ని రోజులుగా స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు, తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా సింగరేణిలో నియామకాలు, కాంట్రాక్టులు, నిధుల వినియోగంపై విజిలెన్స్ ఎంక్వయిరీ జరిపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను కోరినట్లు తెలిపారు. ఈ సమస్యను ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకెళ్లామని, బాధితుల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు భారతీయ జనతా పార్టీ వారి వెంట ఉంటుందని, త్వరలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని పొంగులేటి స్పష్టం చేశారు. ఈ నెల 12 నుండి జరగనున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని ప్రస్తావించనుండగా, ప్రభుత్వం స్పందించకపోతే బాధితుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కిష్టారం ప్రజలు తీవ్ర ఆవేదనతో రైలు పట్టాలపై కూర్చుని బొగ్గు రైళ్లను అడ్డుకునే స్థాయికి వెళ్లినా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం విడ్డూరమని మండపడ్డారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన పునరావాసం కల్పించి, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## గ్రాడ్యుయేట్లు ఎందుకు
# ఓటు వేయలేదో..?

మొదటిపేజీ తరువాయి

అవసరం లేదని.. పసుపు కొనుగోళ్లకు ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్‌కు తెలిపినట్లు చెప్పారు. రైతులను ఆదుకుంటామని అన్నారు. పసుపు బోర్డు తీసుకొచ్చానని ఎంపీ ధర్మపురి అర్వింద్ గొప్పలు చెప్పుకుంటున్నారని.. నిజామాబాద్‌లో పసుపు పండిస్తే, బోర్డును ఢిల్లీలో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన వారే పసుపు బోర్డు చైర్మన్‌గా ఉన్నప్పటికీ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. పసుపు రైతులకు అన్యాయం జరుగుతుంటే అర్వింద్ ఎక్కడ మొహం పెట్టుకుంటాడో చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ఏడాది పసుపు ధర పెరిగితే.. అది కేంద్ర ప్రభుత్వం పసుపు ఎగుమతులు చేయడం ద్వారానే పెరిగిందని చెప్పిన అర్వింద్.. ఇప్పుడు పసుపు ధర తగ్గిన క్రమంలో ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. పసుపు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందని తెలిపారు.

# వారసుల కోసం ఆరాటం

మొదటిపేజీ తరువాయి

అధ్యక్ష పగ్గాలు సీతక్క కుమారుడు సూర్యకు ఇస్తారనే చర్చ జరుగుతుంది. ఇక జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ప్రస్తుతం కొమ్మూరి ప్రతాపరెడ్డి కొనసాగుతున్నారు. వరస వైఫల్యాలు, పార్టీలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో అక్కడ బలమైన నేతకు డీసీసీ పగ్గాలు ఇవ్వాలని అధినాయకత్వం భావిస్తుందట. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం..వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనసాగుతు న్నారు. 2010 నుంచి 14 సంవత్సరాల పాటు కంటిన్యూగా డీసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఈ సారి పార్టీ పగ్గాలు వేరే వాళ్ల చేతిలో పెట్టాలని నాయిని కోరుతున్నారట. పనిలో పనిగా తన మదిలో ఉన్న రెండు పేర్లను అధిష్టానం పెద్దల చెవిలో వేశారట. ఇక వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ కొనసాగుతున్నారు. మంత్రి కొండా సురేఖతో సఖ్యత లేకపోవడంతో ఎర్రబెల్లి స్వర్ణను స్థానంలో మరొకరిని నియమిస్తారని టాక్ వినిపిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్‌గా ప్రకాష్ రెడ్డి ఉన్నారు. ఆయన ఇప్పుడు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగు తున్నారు. దీంతో అతడి స్థానంలో కొత్తవ్యక్తిని డీసీసీ అధ్యక్షుడి కుర్చీలో కూర్చోబెట్టాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లుగా చర్చ జరుగుతుంది. మార్పు కచ్చితంగా ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు ఇక్కడ నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం భరత్ చంద్రారెడ్డి కొనసాగుతున్నారు. ఈయన స్థానంలో కొత్త వ్యక్తికి అవకాశం కల్పిస్తారనే చర్చ జరుగుతోంది. ఇక్కడ సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డితో పాటు, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, మహబూబాబాద్ ఓఎం మురళీనాయక్ నిర్ణయం కీలకం కానుంది. నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు సన్నగిల్లుతున్నా యట. అందుకే కనీసం పార్టీ పదవులతోనైనా సర్దిపెట్టు కోవాలని భావిస్తున్నారట. ముఖ్యంగా డీసీసీ పీఠంపైనే ఎక్కువ మంది దృష్టి పెట్టినట్లుగా తెలుస్తుంది. ఓరుగల్లు కాంగ్రెస్ నేతల వారసులు, అనుచరుల ఆశలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి మరి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కాంట్రాక్టు కార్మికులకు సిఎంపిఎఫ్ స్లిప్పులు ఇవ్వాలి



**పెద్దపల్లి - తెలంగాణ ముచ్చట్లు :**
సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సిఎంపిఎఫ్ స్లిప్పులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను కాంట్రాక్టు కార్మికులకు అలాట్మెంట్ చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియూసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ అలకేషన్ కార్యాలయం వద్ద సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఐదు సంవత్సరాలు గడిచినా సింగరేణి యాజమాన్యం వారికి ఇంత వరకు సిఎంపిఎఫ్ స్లిప్పులు అందజేయలేదని ఆయన ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన సిఎంపిఎఫ్ స్లిప్పులు ఇవ్వకుండా వారిని అనేక ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. సిఎంపిఎఫ్ అధికారులను స్లిప్పులు ఇవ్వాలని అడుగుతె సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన వివరాలు పంపలేదని తెలిపారని, సిఎంపిఎఫ్ స్లిప్పులు ఇవ్వక పోవడం వల్ల వారు నెలనెలా రికవరీ అవుతున్న సిఎంపిఎఫ్ వివరాలు తెలియక ఆందోళన చెందుతున్నారని, స్లిప్పులు వస్తె కొంత మంది తమ అవసరాల కోసం లోన్‌లు తీసుకునే అవకాశం ఉందని యాజమాన్యం వెంటనే వారికి సిఎంపిఎఫ్ స్లిప్పులను అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్జీ వన్‌లో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను కాంట్రాక్టు కార్మికులకు అలాట్మెంట్ చేయాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు చాలీ చాలని వేతనాలతో తమ జీవితాలను గడుపు తున్నారని, వారికి ఇండ్లు లేక అధికంగా ఇంటి అద్దె చెల్లిస్తూ కిరాయి ఇండ్లలో ఉంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని, యాజమాన్యం స్పందించి ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను కాంట్రాక్టు కార్మికులకు అలాట్మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువ క్యాటగిరిలలో పని చేస్తున్నా వారికి అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారని ఇది సరైన విధానం కాదని, వారికి వెంటనే స్కిల్డ్, హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, జి.ఓ.నెం.22 ను గెజిట్ చేయించి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియూసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు బడికల పోశం, జెరిపోతుల శ్రీని వాస్, హరి, సోమారపు రాజయ్య, నర్సయ్య, సతీష్, రాజు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది

**అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్క లబ్ధిదారునికి అందేలా చూస్తా..**


**మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు..**

**ముచినిపర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే..**

**చిట్యాలలో 48 మంది కళ్యాణలక్ష్మీ లబ్దిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్..**

**చిట్యాల, తెలంగాణ ముచ్చట్లు :**
భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాలల్లో రూ. 9.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ముందుగా ఉదయం మండలం లోని గోపాలపూర్ గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ, గోపాలపూర్ నుండి శ్యామ్ నగర్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ముచినిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ముచినిపర్తి నుండి కొత్తపేట వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన చేశారు. చల్లగరిగ, జూకల్, తిరుమలాపూర్, నవాబుపేట, చింతకుంట రామయ్యపల్లి, బావుసింగ్‌పల్లి, గాంధీనగర్, నైన్‌పాక, చైన్‌పాక గ్రామాల్లోని ఎస్సీ కాలనీలల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా, వెంకట్రావ్‌పల్లి(సీ)లో మోడల్ స్కూల్‌లో గ్రావెల్ ఫిల్లింగ్, గ్రౌండ్ లెవలింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. బావుసింగ్ పల్లి నుండి చెంచుకా లనీ, వెంచరామి నుండి కుర్మపల్లి వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 48 మంది కల్యాణలక్ష్మి లబ్దిదారులకు రూ. 48,05,568/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో శంకుస్థాపనల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మారుమూల గ్రామాలు, పంచాయితీలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ప్రజల ప్రతీ అవసరాన్ని తీర్చడమే ద్వేయంగా ముందుకెళ్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క పేద ప్రజలకు అందించేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందని తెలిపారు. ఉచిత ప్రయాణమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లుగా మహిళలను చేయడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన విజయమని అన్నారు. ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, అన్నిరంగాల్లో వారిని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉచిత ప్రయాణం నుంచి బస్సు ఓనర్లుగా మహిళలను మార్చిన ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ఈరోజు పదిమందికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఎదిగారని అన్నారు. సదరు గుత్తేదారులు నాణ్యతతో కూడిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే అన్నారు.





# యువత ఆలోచనలు కార్య రూపం దాల్చేందుకు వీ హబ్ సహకారం

**యువత జాబ్ సీకర్‌గా కాకుండా జాబ్ ప్రొవైడర్ గా మారాలి**

**విద్యార్థులకు నిర్వహించిన ఐడియేషన్ బూట్ క్యాంపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి- తెలంగాణ ముచ్చట్లు**
యువత ఆలోచనలు కార్య రూపం దాల్చేందుకు వీ హబ్ సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యార్థులకు నిర్వహించిన ఐడియేషన్ బూట్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ విద్యార్థులు జాబ్ చేసే ధోరణి నుంచి జాబ్‌లు సృష్టించాలనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలని కలెక్టర్ తెలిపారు. చిన్నతనం నుంచి మనం పెరిగిన వాతావరణం ఒక మంచి జాబ్ దొరికితే లైఫ్ సెటిల్ అవుతుంది అని ఆలోచన మనకు ప్రేరేపిస్తుందని, వీ హబ్ ద్వారా యువతకు మరో వైపు గల అవకాశాలు, యువత ఆశయాలకు తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. చుట్టూ ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలో వినూత్న ఆలోచనలు చేసి యువత పెద్ద పెద్ద కంపెనీలను స్థాపించిందని తెలిపారు. స్విగ్గి, ఓయో, రాపిడో, ఓలా వంటి వివిధ కంపెనీలు చిన్న చిన్న ఆలోచనలతో ప్రారంభమయ్యాయని అన్నారు. యువత తనకు పరిమితులు విధించుకోవద్దని, మనం ఆలోచిస్తే సమాజంలో అనేక అవకాశాలు వస్తాయని అన్నారు. చిన్న చిన్న ఆలోచనలతో వచ్చే యువతకు వీ హబ్ ద్వారా వివిధ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మన చుట్టూ ఉన్న ఏదైనా సమస్య పరిష్కారానికి యువత ఐడియాతో వస్తె దాన్ని కాదే రూపం దాల్చేందుకు అవసరమైన ఫైనాన్స్ సపోర్ట్, మార్కెటింగ్, ప్రోడక్ట్ తయారీ వంటి వివిధ దశల్లో తోడ్పాటు అందించేందుకు వీ హబ్ పని చేస్తుందని అన్నారు. యువత ఆలోచనకు సపోర్ట్ చేసేలా వీ హబ్‌లో ఎకో సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ, 2018లో వీ హబ్‌ను గ్లోబల్ ఎకనామిక్ సమ్మెలో భాగంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సోషల్ ఇంపాక్ట్ లో భాగంగా మహిళలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ అందిస్తామని తెలిపారు. 17 నుంచి 23 వయసు మధ్యలో గల మహిళ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని అన్నారు. వీ హబ్ ద్వారా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ లను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. సోంత ఐడియా ఉన్న మహిళలకు సోంత వ్యాపార ఏర్పాటుకు అవసరమైన సహాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీ-హబ్ సంచాలకులు జహీద్ అక్తర్ షేక్, జిల్లా గ్రామీణ అభి వృద్ధి అధికారి ఎం. కాళిందిని, స్టూడెంట్ ప్రోగ్రామ్ లీడ్ జై, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయి రాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మురళి, గోదావరిఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉష, విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.





**ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో**

# ఆర్‌పిల సేవలు కీలకం

**జిడబ్ల్యుఎంసీ, తెలంగాణముచ్చట్లు :**
ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్దీకరణలో ఆర్‌పిల సేవలు కీలకం అని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయ పడ్డారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు రిసోర్స్ పర్సన్స్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొన్న సమర్ధవంతంగా నిర్వహించుటకు తగ సూచనలు చేశారు. ఈ సందర్భం మేయర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్‌లు తీసుకున్న ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్దీకరించుకునేలా ఫోన్ ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితీతో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఆర్‌పి 100 మంది దరఖాస్తు దారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని క్రమబద్దీకరణ విధానాన్ని తెలియజేసి మార్చి 31 కంటే ముందుగా పేమెంట్ చేసేలా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించడానికి బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినదరి మిలా వాటి సేవలు వినియోగించుకోవాలని జిడబ్ల్యుఎంసీకు సంబంధించినమీ సేవా కేంద్రాల్లో కూడా చెల్లింపులు చేయవచ్చునని ప్లాట్ల క్రమబద్దీకరణ కు దరఖాస్తు చేసుకున్న వారి మొబైల్ ఫోన్‌లకు పే మెంట్ లింక్ కూడా వస్తుందని దాని ద్వారా కూడా చెల్లింపులు జరుపవచ్చునని 25శాతం రిబెట్ అనేది చక్కని అవకాశం అని రిబెట్ పొడిగింపు ఉండదని దరఖాస్తు చేసుకున్న వారికి స్పష్టంగా తెలియజేయాలని ఆర్‌పిలకు మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్ రావు ఏసిపిలు ఏర్షాద్ రజిత టిఎంసి రమేష్ కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు పాల్గొన్నారు.

# పేదొల్ల కలలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం



**పెద్దపల్లి -తెలంగాణ ముచ్చట్లు :**
పేదొల్ల కలలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ఆర్. కే గార్డెన్స్‌లో మంగళవారం పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 471 మంది సీ.ఎం.ఆర్.ఎఫ్ లబ్ధిదారులకు కోటి ఇరవై ఏడు లక్షల డెబ్బై ఏడువేల ఐదు వందల రూపాయలు చెక్కులను, అలాగే పెద్దపల్లి మండలానికి చెందిన 86 మంది కల్యాణలక్ష్మి, షాది ముభారక్ 86,60,034/- లక్షల రూపాయల విలువ గల చెక్కులను తహసీల్దార్‌తో , నాయకులతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..తాను ఎమ్మెల్యే గా గెలిచిన తర్వాత 15 నెలల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 4,300 ఫైళ్లు ప్రభుత్వానికి పంపగా 6 కోట్ల 90 లక్షల 62 వేల రూపా యల విలువగల 2,590 చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే నిమ్స్‌లో ఉచిత వైద్యం కోసం 190 మందికి ఎల్‌వొసిలు ఇప్పించి నట్టు తెలిపారు. అలాగే పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ముగ్గురు ఆర్తో డాక్టర్లు పని చేస్తున్నారని తెలిపారు. గత పాలకుల హయంలో ఒక నెలలో 300 నుండి 400 వరకు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ఓపి 650 నుండి 800 వరకు, 60 నుండి 70 వరకు ఉన్న డెలవరీలు 200 వరకు పెరిగాయని అన్నారు. 50 పడకల ఆసుపత్రిని వంద పడకలకు అప్ గ్రేడ్ చేసుకున్నామని, నూతన భవనం నిర్మించిన ఇక్కడే ఎంఅర్ఐ సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో కొత్తగా గుండె వ్యాధి డాక్టర్ ను నియమించినట్లు తెలిపారు. పేదలందరికీ ఫ్రీ వైద్యం అందించాలన్నదే మా లక్ష్యమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి, డబ్బు వృధా చేసుకో కుండా, జిల్లా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపా యలకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. అలాగే రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో మిత్తి కూడా మాఫీ కాలేదని ఎద్దేవ చేశారు. అలాగే సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లించామని, పెద్దపల్లి నియోజకవర్గంలో 59 కోట్ల 62 లక్షల రూపాయల బోనస్ డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఆరు మండలాలలోని ఆరు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించామని తెలిపారు. రానున్న కాలంలో దశల వారీగా ఇంటి స్థలం ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇం డ్లు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప,ప్యాక్స్ చైర్మన్ అల్లా సుమన్ రెడ్డి, చింతపండు సంపత్, నర్సింహా రెడ్డి,కడార్ల శ్రీనివాస్, మూల ప్రేమ సాగర్ రెడ్డి,గ జవేనా సదయ్య, బొజ్జ శ్రీనివాస్, సందవేణి రాజేందర్, బండారు రామూర్తి, మార్కెట్ డైరెక్టర్లు , మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రణయ్ కేసులో తీర్పు హర్షనీయం: కేవీపీఎస్



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన ప్రణయ్ హత్య కేసు కోర్టు ఇచ్చిన తీర్పుపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంగా (కేవీపీఎస్) హన్మకొండ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం రాంనగర్ లోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ 2018లో మిర్యాలగూడలో హాస్పిటల్ చికిత్స నిమిత్తం వెళుతున్న ప్రణయ్‌ని అతి దారుణంగా హత్య చేసిన దుండగులను శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం పోరాటం నిర్వహించిందని అన్నారు. తీర్పులో ఒకరికీ ఉరి శిక్ష, మిగతా ఆరుగురికి జీవిత ఖైదీలుగా తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కులాంతర వివాహాల చట్టాలు వచ్చినప్పటికీ రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడు ఎలాంటి కులం మతం ప్రాంతం బేధం లేకుండా జీవించాలనే రాజ్యాంగంలో హక్కులున్నప్పటికీ అవి అమలు కావడం లేదన్నారు. భవిష్యత్తులో కూడా కుల దురంహకార హత్యలను అరికట్టే విధంగా హక్కులను కాపాడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్‌కి న్యాయవ్యవస్థకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రేణు కుంట్ల చందర్ సిఐటియు నాయకులు ఆలకుంట మల్లయ్య విద్యార్థి నాయకులు కళ్యాణ్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అరికట్టాలి

**నర్సంపేట, తెలంగాణ ముచ్చట్లు :**
ప్రభుత్వ అసైన్డ్ భూములలో భూ దందాలకు పాల్పడుతూ నిబంధనలను అతిక్రమిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్న వ్యక్తుల పైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు ఈరోజు ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేటలో అత్యంత విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఆర్డీవో ఉమాదేవికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణం జనాభాపరంగా పెరిగి మునిసిపాలిటీగా అవతరించిందని కానీ పేదలకు నివసించడానికి నిలువ నీడ లేక వేలాది కుటుంబాలు కిరాయి చెల్లిస్తూ జీవిస్తున్నారని మరోవైపు పేదలకు చెందాల్సిన ప్రభుత్వ అసైన్డ్ భూములు రోజురోజుకీ అన్యాక్రాంతం అవుతున్నాయని అధికారాన్ని
అండగా చేసుకొని చట్టాలను నిబంధనలను అతిక్రమించి ఏం చేసినా చెల్లుతుందిలే



అన్నట్లుగా వ్యవహారిస్తూ ఎలాంటి హక్కులు లేకపోయినా ప్రభుత్వ అసైన్డ్ భూములలో హద్దు రాళ్లు పాతుతూ మధ్య తరగతి ప్రజలను మభ్యపెడుతూ అమ్మకాలకు కొనుగోళ్లకు పాల్పడుతున్నారని ఈ క్రమంలో భూకబ్జాదారులు భూమి తమదంటే తమదంటూ గొడవలు పడుతూ లేనిపోని శాంతి భద్రతల సమస్యలను సృష్టిస్తున్నారని దీంతో చుట్టుపక్కల ప్రజానీకం భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 111, 702, 813, 204 తదితర ప్రభుత్వ అసైన్డ్ భూములు యదేచ్ఛగా క్రయవిక్రయాలకు పాల్పడుతున్న అధికార యంత్రాంగంకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అసైన్ భూముల రక్షణకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలను సమీకరించి అట్టి భూముల రక్షణకు పేదలకు నిలువ నీడ కల్పించడానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మాషూక్ స్థానిక నాయకులు గజవెల్లి జగపతి నకినబోయిన మహేష్ అశోక్ మాలమ్మ జమున కృష్ణ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు: ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



**పర్వతగిరి, తెలంగాణముచ్చట్లు :**
పర్వతగిరి రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భరోసా ఇచ్చారు. మంగళవారం పర్వతగిరి మండల కేంద్రంలోని 0.2 పర్వతగిరి రిజర్వాయర్ క్రింద ఉన్న ఆయకట్టు రైతులు తమ పంట పొలాలకు నీళ్లు అందడం లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రిజర్వాయర్ సందర్శించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులు వేసిన పంట పొలాలకు నీళ్ళు అందించలేక జాప్యం చేయడంతో ఇరిగేషన్ అధికారులను మందలించి సంబంధిత ఉన్నతాధికారులతో,జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి త్వరగా నీళ్లు అందించేలా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి రైతులు ఎవరు ఆందోళన చెందువద్దని, త్వరలోనే 0.2 టిఎంసిలో పర్వతగిరి రిజర్వాయర్ ద్వారా నీళ్ళు అందించే విధంగా సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎంసి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు,మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్,పాల్గొన్నారు.

# బీసీలను ఎమ్మెల్సీలుగా చేయడం హర్షనీయం

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
రాష్ట్రంలో రోజు రోజుకు బిసిలో వస్తున్న రాజకీయ చైతన్యాన్ని చూసి అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎంపికల్లో సామాజిక న్యాయం పాటించడం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో బీసీ కులాల ఆదరణ, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు ఓటు బ్యాంకుతో సంఘటితం కావడం, బీసీలు నిరంతరం ఉద్యమించడన్ని గమనించిన అధికార కాంగ్రెస్ పార్టీ మూడు ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు, టిఆర్ఎస్, సిపిఐ కూడా బీసీ అభ్యర్థులను ప్రకటించడం అభినందనమని అన్నారు.

# 16న సీఎం పర్యటనను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే కడియం



**జనగామ, తెలంగాణముచ్చట్లు :** శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫల కాలు, డిజైన్ నమూనాలు ఇతరాత్ర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు, డీసీపీతో కలిసి జిల్లా అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14వ తేదీ సాయంత్రంలోగ శంకుస్థాపనలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాల ని, ఏవైనా లోటు పాట్లు ఉంటే సరిచేసుకోవడానికి వెసులుబాటు ఉంటుందని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి గాని, కలెక్టర్ దృష్టికి గాని తీసు కురావాలని అధికారులకు సూచించారు. 16వ తేదీ మధ్యాహ్నం 12:00 గంటలకు ముఖ్యమంత్రి ఘనపూర్ సభా స్థలికి చేరుకుంటారని 12:30 గంటల నుండి 01:00 గంటల వరకు శంకుస్థాపనలు, 01:00 గంటల నుండి 02:30గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ప్రోటోకల్ కు కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఇంకా కేవలం 4రోజుల సమయం మాత్రమే ఉన్నందున అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సభా ఏర్పాట్లకు సంబంధించి డయాస్, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీవీఐపీ పార్కింగ్, ఆయా మండలాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ వంటి ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది రాకుండ సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా పటిష్టమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని తెలిపారు.ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా కింది స్థాయివరకు పర్యవేక్షణతో పని చేయాలని తెలిపారు. ఇందుకు జిల్లా అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 23న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**పరకాల, తెలంగాణముచ్చట్లు :**
విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మార్చి 23న, హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. మంగళవారం పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సన్నహాక సమావేశం మాజీ ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ బాధ్యులు సీనియర్ జర్నలిస్ట్ దామెర రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నాటీ నుండి నేటి వరకు ఎందరో నాయకులను సమాజానికి అందించిందన్నారు. ఈ క్రమంలో 1970 నుండి 2016 వరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులతో మహా సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శిలు జి.గంగాధర్,డి. తిరుపతి, పరకాల డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్,అంకేశ్వరపు ఐలయ్య, వరంగల్ ఏఎంసి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, నక్క చిరంజీవి,మైస సురేందర్, కోగిల చంద్రమౌళి, తుడుం క్రాంతి, బొల్లారం సంపత్, జి, కరుణాకర్, దొగ్గెల.కుమార్,ఏ. ప్రశాంత్ వైద్య, నాగుల కుమార్, యం. రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో



**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు :** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఒక ప్రైవేట్ హాస్పిటల్లో సంభవించిన మాతృ మరణముల గురించి వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి ఒక ఎక్స్పర్ట్ కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతిమ క్యాన్సర్ హాస్పిటల్ అపోలో ఎన్ఎస్ఆర్ వైస్ హాస్పిటల్ లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపినారు క్లినిక్కులు, పోలీక్లినిక్కులు, హాస్పిటల్స్ నడిపే వారు తప్పనిసరిగా నియమనిబంధనలు పాటించాలని కోరారు. జిల్లాలోని అన్ని క్లినిక్కులు, పోలీ క్లినిక్కులు, ల్యాబ్‌లు, హాస్పిటల్స్, వెల్నెస్ సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, నేత్ర క్లినిక్కులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, అలాగే జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్కులు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేనిచో పెనాలిటీ, సీస్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.. ఆర్ఎంపీ వైద్యులు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదని వారి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనీ ఇంజెక్షన్లు, సెలైన్‌లు పెట్టరాదని అల్లోపతీ వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచుకోరాదని ఆయన తెలిపారు. ప్రతి క్లినిక్, పోలీక్లినిక్, నర్సింగ్ హోమ్, హాస్పిటల్స్ మరియు ఆయుష్ క్లినికల్, పోలీ క్లినిక్ ఆసుపత్రుల వారు వారి వారి సెంటర్లలో వసూలు చేయి ఫీజుల వివరములు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్ నందు బోర్డులు ఏర్పాటు చేయాలనీ, ఆ ప్రకారమే రోగుల నుండి చార్జీలు వసూలు చేయాలనీ, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వారి, వారి ఇంస్టిట్యూట్స్లో పని చేసే వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, వారి వారి విద్యార్హతలు కూడా రిసెప్షన్ వద్ద ప్రదర్శించాలని కోరారు. ప్రతి హాస్పిటల్, నర్సింగ్ హోమ్ వారు నిర్ణయించుకున్న రేట్స్ (రాక్ రేట్లను) ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటివారంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని లేనిచో కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో సిజేరియన్ ఎక్కువగా ఉంది కాబట్టి తప్పనిసరిగా ఇండికేషన్‌ఉన్న కేసులకు మాత్రమే సి-సెక్షన్ కాన్పులు చేయాలి. అనవసరంగా ఇండికేషన కాకుండా సి-సెక్షన్ కాన్పులు చేస్తే వైద్య అధికారులు కేసు ఆడిట్ చేసి అనవసరంగా సి సెక్షన్ చేసిన హాస్పిటల్స్ పై చర్యలు తీసుకుంటారు మరియు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కు రాసి సదరు వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబందలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షలో అబార్షన్స్ చేయాలనీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్స్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెల చేసిన అబార్షన్స్ వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయంలో అందించాలని కోరారు. గైనకాలజిస్టులు ఏఆర్టి సరోగసి లెవెల్ వన్ లెవల్ టు, రిజిస్ట్రేషన్లు కలిగిఉన్న వారు మాత్రమే ఐవీఎఫ్ సెంటర్లు నడుపుకోవడానికి అర్హులని తెలిపారు. జిల్లాలో తనిఖీ బృందాలు నిరంతరం క్లినిక్కులు, ఆస్పత్రులు, తనికీ చేస్తుంటాయని, తనికీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరములు చూపించాలన్నారు కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన అనిల్ కుమార్, మనోజ, ఎల్ డి కంప్యూటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**
కాటారం మండలం గంగారం గ్రామంలో జరిగిన హత్యకేసులో నిందితుడికి భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు జీవిత ఖైదు మరియు పదివేల రూపాయలు జరిమాన విదిస్తూ తీర్పు ఇచ్చారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. మారుపాక అశోక్ మరియు మారుపాక నాగరాజు అన్నదమ్ములు. వీరికి వారి స్వగ్రామంలో ఇంటిస్థలం ఉండగా నిందితుడు మారుపాక అశోక్ మరియు అతని అన్న మారుపాక నాగరాజు, వారి తల్లి మారుపాక శంకరమ్మ సమానంగా పంచుకున్నారు. ఆ స్థలంలో తన వాటాకు వచ్చిన స్థలంలో మారుపాక నాగరాజు చిన్న ఇల్లు నిర్మించుకున్నాడు. నిందితుడు మారుపాక అశోక్ త్రాగుడుకు అలవాటుపడి తన వాటాకు వచ్చిన భూమిని అమ్ముకొని ఖర్చు చేసుకున్నాడు. అప్పటి నుండి అశోక్ తన అన్న నాగరాజును అతను కట్టుకున్న ఇంటిలో వాటా వస్తుందని ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతానని బెదిరించగా అతను గ్రామము నుండి కుటుంబంతో సహా వెళ్ళిపోయి వేరే గ్రామంలో బతుకుతున్నాడు. ఈ క్రమంలో 2019 సంవత్సరం మే 10న ఎంపీటీసీ ఎలక్షన్‌లో ఓటు వేయడానికి నాగరాజు గంగారం రాగా నిందితుడు అశోక్ ఇంటి స్థలం విషయంలో గొడవపడి ఖాళీ బీరు బాటిల్ పగులగొట్టి తన అన్న గొంతులో పొడవగా చనిపోయాడు. మృతుడి భార్య మారుపాక సరిత కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి కాటారం ఎస్‌హెచ్‌వోగా ఉన్న హెడ్ కానిస్టేబుల్ మహేందర్ నిందితుడిపై హత్య కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం సీఐ శివప్రసాద్ నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. తదుపరి సీఐగా వచ్చిన బీ. హతీరామ్ దర్యాప్తు పూర్తి చేసి సరియైన సాక్ష్యాదారాలతో కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించినారు కోర్ట్ లైజన్ ఆఫీసర్ ఏఎస్సై గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్లు కే. రమేష్ మరియు కే. వినోద్‌లు సాక్షులను సరిమైన సమయంలో కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరం రుజువు అయినందున భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు నిందితునికి జీవిత ఖైదు మరియు పదివేల రూపాయలు జరిమాన విదిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ మరియు అప్పటి దర్యాప్తు అధికారులను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

# నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలి

కామన్ మెనూ డైట్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

కూరగాయలు, పండ్లు, గుడ్ల నాణ్యత లేకపోతే వాడవద్దు

రంగంపల్లిలోని మహాత్మజ్యోతిభా పూలే బీసి బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**పెద్దపల్లి- తెలంగాణ ముచ్చట్లు :**

ప్రభుత్వ గురుకులాలలో చదివే బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ పెద్దపల్లిలోని రంగంపల్లిలో ఉన్న మహాత్మజ్యోతిభా పూలే బీసి బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. బాలికల గురుకులంలో డార్మెంటరీ, క్లాస్ రూమ్, పారిశుధ్య నిర్వహణ, భోజన హాల్, వంట గది, వంట సామాగ్రి భద్ర పర్చే ప్రదేశా లను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి హాస్టల్లో అంది స్తున్న భోజనం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, విద్య బోధన వంటి వివరా లను ఆరా తీశారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అ రుణ శ్రీ మాట్లాడుతూ, గురుకులంలో విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. హాస్టల్‌కు విద్యార్థుల కోసం వచ్చే గుడ్లు కూరగా యలు, పండ్లు, బియ్యం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. 2 రోజుల మించి గుడ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు తాజా గుడ్లను విద్యార్థులకు అందించాలని సూచించారు. బీసి బాలికల గురుకులంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బాలికలకు ప్రభుత్వం నిర్దేశించిన కామన్ మెన్యూను తప్పని సరిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల దృష్ట్యా స్టడీ అవర్స్ నిర్వహించాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు విద్యార్థినులు పూర్తి స్థాయిలో సిద్ధం అయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గురుకులంలో డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు తయారు చేసి పనులు త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పిల్లలతో కలిసి భోజనం చేశారు. స్థానిక సంస్థల కలెక్టర్ వెంట బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ మణీ దీప్తి, ఉపాధ్యాయినులు విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల అప్లికేషన్ 20 వరకు పొడిగింపు

**ధర్మారం - తెలంగాణ ముచ్చట్లు :**

ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6 వ తరగతి , 7వ తరగతి నుండి 10 వ తరగతి వరకు గల పాఠశాల ప్రవేశాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ హైదరాబాద్ వారు విద్యార్థుల కోసం అప్లయ్ చేసుకోవటానికి చివరి అవకాశంగా అప్లయ్ తేదీ, పరీక్ష తేదిని మార్చటం జరిగిందని ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ధర్మారం ఆదర్శ పాఠశాల ప్రవేశం కోసం telnaganams.cgg.gov.in గవర్నమెంట్ వెబ్ సైట్ ద్వారా అర్హత గల ధర్మారం మండల విద్యార్థిని విద్యార్థులు అప్లయ్ చేసుకోవాలని, విద్యార్థుల సర్వతోభివృద్ధికి తోడ్పడే ఎన్నో కార్యక్రమాలతో విద్యార్థుల భవిష్యత్తు ను మార్గనిర్దేశం చేసే ధర్మారం ఆదర్శ పాఠశాల ప్రవేశం కోసం మారిన తేదీల ప్రకారం మార్చి 20 తేదీ వరకు ఆన్లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని, అన్ని తరగతులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం ఉంటుందని.కొత్త తేదీలకు అనుకూలంగా విద్యార్థులు, తల్లితండ్రులు సిద్ధంగా ఉండాలని అయన పేర్కొన్నారు.

# పూడికతీత మట్టి తరలింపు వేగంగా జరగాలి



హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు :**

భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరగాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు.మంగళవారం భద్రకాళి చెరువులో పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు నుండి పూడికతీత మట్టి తరలింపు రూట్ మ్యాప్, వాహనాల రాకపోకలకు సంబంధించి వేస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, మట్టి తరలించేందుకు ఇచ్చే వాహనాల కూపన్లను పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని ఎంత తరలించారనే వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులో నుండి కట్టవరకు చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపును అధికారులు వేగవంతం చేయాలన్నారు. పూడికతీత మట్టిని బుధవారం నుండి ప్రారంభించాలన్నారు. పూడికతీత మట్టి పనులు జరుగుతున్న ప్రాంతంలో విద్యుత్తులైట్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలింపు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూడికతీత మట్టి పనులు సజావుగా సాగేటట్టు అధికారులు సమన్వ యంతో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ హర్షవర్ధన్ , కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జపాన్‌లో దేవర పూనకాలు



**టోక్యో, తెలంగాణముచ్చట్లు :**

జపాన్‌లో దేవర ఈనెల 28న రిలీజ్ కాబోతోంది. 22న అక్కడ ల్యాండై ఎన్టీఆర్ కూడా ప్రమోషన్‌లో ఎమోషన్ పెంచబోతున్నాడు. అయితే ఆ సందడి మొదలవ్వక ముందే, అక్కడ అడ్వాన్స్ బుక్కింగ్స్‌తో పూనకాలు మొదలయ్యాయి. జపాన్‌లో ఎన్టీఆర్‌కి ఎంత ఫ్యాన్స్ ఉన్నా, సినిమా కోసం హీరోలకు కటౌట్లు కట్టే కల్చర్ అక్కడ లేదు. అమెరికాలో అంటే అక్కడ సెటిలైన తెలుగోల్ల సంఖ్య భారీగా పెరగటంతో, అక్కడ తెలుగు సినిమాల వెలు గులే మారిపోయాయి. అక్కడ మన మూవీలు విడుదలైతే ఉండే హంగామానే మారిపోయింది. కాని జపాన్‌లో భారతీయులు, మరీ ముఖ్య ంగా తెలుగువాళ్లు మరీ తక్కువ? అయినా టిక్కెట్లు అక్కడ అంతగా బుక్ అవుతున్నాయి. అడ్వాన్స్ బుక్కింగ్ మొదలవ్వగానే జరుగుతున్న బుక్కింగ్స్‌లో లెక్కలు షాకిస్తున్నాయి. బుక్ అయిన ప్రతీ 100 టిక్కెట్స్ లో 80 మంది జపనీయులే ఉంటున్నారు. 20 మందే తెలుగు వాళ్లు ఈ టిక్కెట్స్ కొంటున్నారు.. అంతగా అక్కడ ఎన్టీఆర్‌కి లోకల్ ఫ్యాన్స్ పెరిగిపో యారా? జపాన్‌లో దేవర పూనకాలు మొదల య్యాయి. ఈనెల 28న రిలీజ్ అయ్యే ఈసినమాకోసం ఇప్పుడే అడ్వాన్స్ బుక్కింగ్స్ మొదలయ్యాయి. విచిత్రం ఏంటంటే బుక్కయ్యే ప్రతి 100 టిక్కెట్స్‌లో అక్కడ సెటిలైన ఇండియన్స్ 20 మంది కొంటే, మిగతా 80 టిక్కెట్స్ లోకల్ జపనీస్ కొంటున్నారట. దీన్ని బట్టే తారక్‌కి జపాన్‌లో కూడా క్రేజ్ మెల్లిగా పెరుగుతోందని తెలుస్తోంది.అంతా త్రిబుల్ ఆర్ మాయే అనుకునే అవకాశం ఉంది. కాని నిజానికి తనకి యమదొంగ టైం పీరియడ్ నుంచే జపాన్‌లో ఫ్యాన్ బేస్ క్రియేట్ అయ్యింది. యమదొంగ నుంచి త్రిబుల్ ఆర్ వరకు తన ప్రతీ మూవీ యూట్యూబ్ పుణ్యమాని అక్కడ కూడా డబ్బింగ్ రూపంలో ఎవేలబుల్‌గా ఉంది. అరవింద సమేత వీరరాఘవ అ యితే జపనీస్ సబ్ టైటిల్స్ వల్ల, అక్కడి జనాలకు దగ్గరైంది.సో త్రిబుల్ ఆర్ కంటేము ందే ఎన్టీఆర్‌కి జపాన్‌లో ఫ్యాన్స్ ఉన్నారనటానికి ఇదే నిదర్శనం.అరవింద సమేత వీరరాఘవ సినిమా సెట్‌కి కూడా తన జపాన్ ఫ్యాన్స్ వచ్చి సందడి చేయటం, ఫోటోలు దిగటం జరిగింది. అలాంటి తారక్ త్రిబుల్ ఆర్‌తో మరింతగా గ్లోబల్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. నాటు నాటు పాటతో ప్రపంచ వ్యాప్తంగా మరీ ముఖ్యంగా తన జపాన్ ఫ్యాన్ బేస్‌లో ఇంకా చొచ్చుకెళ్లాడు.కాబట్టే ఇప్పుడు తన దేవర మూవీ జపాన్‌లో రిలీజ్ అవుతోందటే, అక్కడి లోకల్స్ ఇంట్రస్ట్ చూపించటంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. పదేళ్లుగా ఇలా తన జపాన్ ఫ్యాన్ బేస్ ని పెంచుకుంటూ, దూసుకెళుతున్నాడు కాబట్టే తారక్, పనికట్టుకుని అక్కడ ప్రమోషన్ కోసం వెళుతున్నాడు.ఈనెల 22న జపాన్ వెళ్లనున్న తను ఏకంగా 6 రోజుల్లో 8 నగరాల్లో దేవర మూవీని ప్రమోట్ చేయబోతున్నాడు. ప్రస్థుత అడ్వాన్స్ బుక్కింగ్స్ లెక్కలు చూస్తే ఈ పాటికే లక్షా ఇరవై వేల టిక్కెట్లు సేల్ అయ్యాయట. అందులో 20 వేలే ఇండియన్ సెటిలర్స్ కొంటే, మిగతా లక్షా జపాన్ లోకల్స్ కొన్నట్టు లెక్కలతో తేలుతోంది.దేవర ఏమాత్రం అక్కడ వర్కవుట్ అయినా, వార్2, డ్రాగన్ మాత్రమే కాదు, దేవర సీక్వెల్‌కి కూడా అక్కడ పూనకాలు రావటం ఖాయం.

# సినిమాలపై పవన్..



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగానే బిజీ అయ్యాడు. ఇక తన పెండింగ్ సినిమాలు పని అంతే అనుకున్నారు. కాని సడన్‌గా పవన్ తన దర్శక నిర్మాతలుకు డేట్లిచ్చాడు. హరి హర వీర మల్లు ఫస్ట్ పార్ట్‌ని, అలానే ఓజీని పూర్తి చేసేందుకు సిద్ధమయ్యాడు. ఒకవైపు పొలిటికల్‌గా ఎంత బిజీ అయినా, తను కొత్త మూవీలు కమిట్ కాకున్నా, గత సినిమాలను పూర్తి చేసేందుకే ఫిక్స్ అయ్యాడు. అందుకోసం తన లుక్ మార్చుకుంటున్నాడు. వర్కవుట్లు షురూ చేశాడు. ఐతే రోజుకి రెండు కోట్ల చొప్పున 16 రోజులకు 32 కోట్ల పారితో షికంతో, 600 కోట్ల మార్కెట్ కోసం కష్టపడుతున్నాడు. కాకపోతే తన సినిమా అప్ డేట్లు లేవు. ఆ గోలే కొంతకాలంగా కనిపిం చట్లేదు. అదేదో వెటరన్ హీరోగా పవన్ మారిపోయినట్టు.. తన ఫ్యాన్స్ నుంచి కూడా సినిమా అంచనాలు, ఆశలు కనిపించట్లేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గత కొన్నేళ్లుగా రాజాకీయాలు, లేదంటు ప్రభుత్వ ఏర్పాటు తో డిప్యూటి సీఎంగా పని బాధ్యతలతో పూర్తిగా సినిమాలకు దూరమయ్యాడు. ఎప్పుడో కమిటైన హరి హర వీరమల్లు, కొంత పూర్తైన ఓజీ మూవీలు ఎప్పుడు కంప్లీట్ చేస్తాడనే డౌట్ కూడా ఆవిరైపోతున్నటైంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు..బాధ్యత ఒకవైపు సినిమాలు పూర్తి చేయాల్సిన అవసరం మరో వైపు.. మొత్తంగా ఇప్పుడు తన పెండింగ్ మూవీలను పూర్తి చేసేందుకు రెడీ అవుతున్నాడు. సినిమాలకు దూరమయ్యాక తన లుక్ మొత్తం బొద్దుగా తయారవటంతో, మళ్లీ వర్కవుట్లు పెంచి లుక్ మార్చుకునే పనిలో ఉన్నాడు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తీస్తూనే పెండింగ్ సినిమాలను పూర్తి చేసేందుకు తనని తాను మార్చు కుంటున్నాడు.హరి హర వీరమల్లు మూవీ ఫస్ట్ పార్ట్‌ని పూర్తి చేసేందుకు 6 రోజుల కాల్ షీట్స్ కేటాయించిన పవన్, సుజీత్ మూవీ ఓజీ కోసం 10 రోజుల కాల్ షీట్స్ ఇచ్చాడట. సో 6 రోజుల షూటింగ్‌తో హరి హర వీరమల్లు ఫస్ట్ పార్ట్ పెండింగ్ షూటింగ్ పూర్తవుతుంది. ఇక ఓజీ అయితే కేవలం 10 రోజుల్లో 8 మేజర్ సీన్లతో 70 శాతం టాకీ పార్ట్ పూర్తి చేసేలా ప్లాన్ చేశాడు సుజీత్.మొత్తంగా ఈ రెండు సినిమాల్లో పాటలు 4 చొప్పున తగ్గించి, ఎక్కువగా టాకీ పార్ట్ ఉండేలా కథలో మార్పులు చేశారట. ఒకప్పటిలా వారాలు, నెలలు కాల్ షీట్స్ కేటాయించే పరిస్థితుల్లో పవన్ లేడు. అలాని కమిటైన మూవీలను పూర్తి చేయ కపోతే కరెక్ట్ కాదు. కాబట్టే ప్రస్థుతం ఈరెండింటిని పూర్తిచేసేపనిలో పడ్డాడు పవన్. మే ఎండ్‌లోగా ఓజీ కూడా వందకు వంద శాతం షూటింగ్ పూర్తవుతుందట. దసరాక ఓజీ వచ్చే అవకాశాలున్నాయి. ఇక హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ దసరా తర్వాత కంటిన్యూయస్‌గా రెండునెలలు కేటాయించి పూర్తి చేసేలా పవన్ తన కాల్ షీట్స్ కేటాయించాడని తెలుస్తోంది. సో సమ్మర్‌లో హరి హర వీరమల్లు, దసరాకు ఓజీ, వచ్చే ఏడాది సంక్రాంతికి హరీష్ శంకర్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ రావటం పక్కా అయ్యింది. మొత్తంగా పొలిటికల్‌గా గెలిచి చూపించిన పవన్, అలా దూసుకెళుతున్నందుకు ఫ్యాన్స్ ఎంత సంతోషించినా, తమ అభిమాన హీరో సినిమాలు రావట్లేదనే అసంత్రుప్తి మాత్రం ఉండనే ఉంటుంది. సో ఇప్పుడు మూడు మూవీలు ఏడాది పొడుగునా రాబోతున్నాయి కాబట్టి, ఆ వెలితి కూడా తీరబోతోంది. పవర్ స్టార్ ఫ్యాన్స్‌కి కూడా సినీ పండగ వచ్చే రోజు దగ్గర్లోనే కనిపిస్తోంది.


# అన్నీ తానై...అంతా తానై..



**కరీంనగర్,తెలంగాణ ముచ్చట్లు :**

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు వచ్చాయి. అవి అందరూ ఓట్లేసే ఎన్నికలు కావు. చదువుకున్న వారు అదీ డిగ్రీ ఆపైన చదువుకున్న టీచర్లు, గ్రాడ్యుయేట్లు మాత్రమే ఓట్లేసే ఎన్నికలు. వారిని కన్విన్స్ చేసి ఓట్లు వేయించుకోవడం అంత ఈజీ కాదు. అయినా బీజేపీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించి రంగంలోకి దిగింది. ప్రకటించిన అభ్యర్థులు కొత్తవారు. నాలుగు జిల్లాల్లో ఉన్న ఆ పార్టీ క్యాడర్‌కి కూడా సుపరిచిత నేతలేం కాదు. అయినా ఆ ఇద్దరు విజయం సాధించారు. ఇప్పుడా విక్టరీపై విశ్లేషణలు జోరుగా సాగుతు న్నాయి. ఆ విక్టరీ వెనక ఎవరున్నారు..? గెలుపుకు ఏయే అంశాలు దోహద పడ్డాయి..?ఉత్తర తెలంగాణలో కమలం వికసించింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను కైవసం చేసుకుని బీజేపీ తన సత్తా చాటింది. అటు టీచర్ల ఎమ్మెల్సీ ఇటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను తన ఖాతాలో వేసుకుని దూకుడు ప్రదర్శిస్తోంది. రెండు సీట్లను గెలుచుకోవడం కోసం పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగి ప్రత్యర్థులను మట్టి కరిపించారు కమలనాథులు.. అందరికంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది బీజేపీ.. పట్టభద్రుల స్థానానికి సంగారెడ్డి జిల్లాకు చెందిన చిన్నమైల్ అంజిరెడ్డిని.. ఉపాధ్యాయ నియోజకవర్గానికి ప్రైవేట్ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్యలను ఖరారు చేసింది.ఆ ఇద్దరు అభ్యర్థులు కూడా అటు పార్టీలో పెద్ద పేరున్న నేతలేం కాదు. ఇటు ప్రజల్లో పలుకుబడి కూడా అంతంత మాత్రమే. అయితే క్యాండేట్‌లను ప్రకటించడమే ఆలస్యం క్యాంపేయినింగ్ స్టార్ట్ చేసింది కాషాయ పార్టీ. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే అభ్యర్థులు ప్రచారం ప్రారంభించడం ప్లస్ పాయింట్‌గా మారింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ బరిలోకి దిగకపోవడంతో అధికార కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా పోరు మారింది. దాంతో రెండు పార్టీలు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.బీజేపీ నాయకత్వం మొత్తం రంగంలోకి దిగి తమదైన శైలిలో ప్రచారాన్ని హోరెత్తించింది. ఉత్తర తెలంగాణలో జరిగిన ఎన్నికలను డీల్ చేసేందుకు అటు సంఘ్ పరివార్, ఇటు బీజేపీ క్యాడర్‌ను ఫీల్డ్‌లోకి దించి ఎక్కడికక్కడ బాధ్యతలను అప్పగించారు. ముందుగా పార్టీ క్యాడర్‌తో మీటింగ్‌లు నిర్వహించి. ఎన్నికల్లో గెలుపు ఆవశ్యకతను చెప్పి వారిని సమాయాత్తం చేశారు. క్యాడర్‌ను మోటివేట్ చేసే బాధ్యతల్ని పార్టీలోని ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తీసుకున్నారు.క్యాడర్‌కు శిక్షణ పూర్తికాగానే ఓటర్లను కలిసే కార్యక్రమానికి రూపకల్పన చేసి క్షేత్రస్థాయి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ వ్యవహారాలు అన్నీ చక్కదిద్దే బాధ్యతతో పాటు, ప్రచారాన్ని లీడ్ చేసారు కేంద్రమంత్రి బండి సంజయ్.. 25మందికి, 50మంది ఓటర్లకు ఒకరు చొప్పున పచ్చీస్ ప్రభారీ, పచాస్ ప్రభారీలను ఇన్చార్జులుగా నియమించి వారిని మానిటర్ చేసే పనిని సైతం సంజయ్ స్వయంగా చేపట్టారంటే బీజేపీ ఈ ఎన్నికలను ఎంత చాలెంజ్‌గా తీసుకుందో అర్ధం చేసుకోవచ్చు.పచ్చీస్ ప్రభారీలతో కేంద్రమంత్రి నిత్యం మాట్లాడుతూ వారిని ఉత్తేజ పరచడమే కాకుండా వారితో భారీ సమావేశాలను సైతం ఏర్పాటు చేసారు. కాంగ్రెస్ పార్టీ బహిరంగసభలను నిర్వహించి సీఎం రేవంత్‌తో ప్రసంగింప చేస్తే బీజేపీ రూట్ మార్చి ఇంచార్జిలతో సమావేశాలను నిర్వహించింది. ఆ ఇంచార్జ్‌లు ఒక్కొక్క ఓటరును కనీసం రెండ్రోజులకు ఓసారి కలిసేలా ప్లాన్ చేశారు. బీజేపీ తమకు ఉన్న అన్ని వనరులను ఉపయోగించి పట్టభద్రులకు, టీచర్లకు ఉన్న సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేసింది.వారి సమస్యలు తెలుసుకుని గత ప్రభుత్వం.. ప్రస్తుతం ప్రభుత్వం తీరును ఎండగడుతూ ప్రచారం సాగించింది. క్యాంపెయినింగ్ బాధ్యత అంతా తన భుజాలపై వేసుకున్న సంజయ్? తమ పార్టీ వివిధ సమస్యలపై పోరాడిన తీరును.. 317 జీవో.. నిరుద్యోగుల సమస్యలపై గతంలో చేసిన కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగడం బాగా కలిసి వచ్చింది. పైగా బీజేపీకి ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు ఈ స్థానం పరిధిలోనే ఉండటం. ఎంపీల్లో నలుగురు ఇక్కడే ఉండటం ప్లస్ పాయింట్‌గా మారింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు దాదాపు నెల రోజుల పాటు ఇతర పనులను పక్కనబెట్టి ఎమ్మెల్సీ పనిలోనే ఉండటం బాగా కలిసి వచ్చిందని చెప్పాలి.

# కంచంలో కూడున్న తినలేని రైతన్న.



**శాయంపేట, తెలంగాణ ముచ్చట్లు :**
కంచంలో కూడున్న తినలేని పరిస్థితి అన్నట్లుగా రైతులు దుర్భమైన పరిస్థితి లో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అన్నారు. ధర్మసాగర్ వరకు నీటిని పంపు చేసే చలివాగు ప్రాజెక్ట్ చేరువలో ఉన్న ఇక్కడి రైతులకు సాగు నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను చూసి రైతన్న దిగ్భ్రాంతి చెంది రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో రైతులు,బిఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో మండలంలోని జోగంపల్లి గ్రామంలోని లిఫ్ట్ ఇరిగేషన్ గేటు ముందు సుమారు రెండు గంటల పాటు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పంపు హౌస్ సీఈ అశోక్ కుమార్ కు ప్రాజెక్ట్ వద్ద నుండి ఫోన్ చేసి చలివాగు ప్రాజెక్ట్ లో కనీసం 15 అడుగుల నీటిమట్టం ఉండేలా చర్యలు చేపట్టి ఇటు చలివాగు ఆయకట్టు వెంట పండే పంట పొలాలకు సాగు నీరు విడుదల చేసిన తరువాతే పైకి ధర్మసాగర్ కి నీటిని పంపిణీ చేయాలని,ఇక్కడి రైతులు రైతులు కాదన్నట్టు, అక్కడి వారే రైతులు అన్నట్టు వ్యవహరించి ఇక్కడి పంట పొలాలను ఎండబెట్టి పైకి నీటిని తీసుకెళ్ళాలని చూస్తే ఊరుకునేది లేదని పంపు మోటార్లు బంధు పెడతామని హెచ్చరించారు.

ప్రస్తుతం పది అడుగుల నీటిమట్టం మాత్రమే నీటి మట్టం ఉందన్నారు.నెల రోజుల పాటు చలివాగు ప్రాజెక్ట్ లోకి నీటిని విడుదల బంధు పెట్టడం వల్లే సమస్య ఏర్పడిందని ఈ ప్రాంతం రైతులకు సాగు,తాగు నీటిని విడుదల చేసిన తరువాత కనీసం 15 అడుగుల నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకొని తరువాత పైకి నీటిని పంపు చేయాలని నీటి మట్టం పెరిగే వరకు మోటార్లు బంధు పెట్టాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూఅన్నపూర్ణ రాష్ట్రంగా ఉన్న నా తెలంగాణ రాష్ట్రాన్ని అనాలోచిత అసమర్థత పాలన వల్ల రైతులు ఆందోళనతో తీవ్రమైన నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అందుకే రైతుల పక్షాన ప్రజల పక్షాన చలివాగు ప్రాజెక్టు వద్ద ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అనాలోచిత పరిపాలన అని జనవరి నెలలో దాదాపు నెల రోజుల పాటు చలివాగు ప్రాజెక్ట్ లోకి నీటి పంపిణీ జరగలేదని కాంట్రాక్టర్ కు ఇవ్వాల్సిన 5 కోట్ల రూపాయల బిల్లులు, లిఫ్ట్ ఇరిగేషన్‌లో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడం వల్ల పంపింగ్ బంధు చేయడంతో నీటి సమస్య ఏర్పడిందనిరైతులకు సాగునీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అసమర్థత స్పష్టంగా కనిపిస్తుందని,బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ముఖ్య మంత్రి కార్యాలయం నుండి ఫోన్ వచ్చినప్పటికీ రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని మోటార్లు బంధు పెట్టి పైకి నీటిని పంపు చేయలేనని ఖరాఖండిగా చెప్పి నాడు చలివాగు పంపు మోటార్లు బంధు పెట్టి చలివాగు ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఎగువన ఉండే పొలాలకు నీళ్లు పోతాయని ఇక్కడి పంట పొలాలు ఎండగొడితే మాత్రం ఎకరాకు 50 వేల రూపాయల నష్ట పరిహారం ప్రభుత్వం బేషరతుగా ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు.ధర్నా చేపట్టడంతో అధికారులు స్పందించి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన తరువాత ఇరిగేషన్ ఈఈ జోవంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఎదుట ధర్నా చేపట్టిన ప్రాంతానికి వచ్చి 6 రోజుల లోపుల 15 అడుగుల నీటిమట్టం తీసు కొస్తామని హామీ ఇచ్చారు.ఒకవేళ 15 అడు గుల నీటిమట్టం రాకుండా ఇక్కడి పంట పొలాలు ఎండగోడితే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని అవసరమైతే తాళాలు పగల గొట్టి, మోటార్లు బంధు పెడతామని హెచ్చరించారు.గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వారం రోజు లకు ఒక్కసారి చలివాగు నీటిమట్టం పై అధికారులతో మాట్లాడి నీటి మట్టం తగ్గితే మోటా ర్లు బంధు పెట్టించి నీటి మట్టం పెరిగిన తరువాత పంపింగ్ చేయమని అధికారులకు చెప్పేది వాళ్ళు కూడా అదే విధంగా సహకరించేవారని,కానీ ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లోపమా..నాయకత్వ లోపమా... చేతకాని తనం వల్ల రైతులకు దుర్భరమైన పరిస్థితి దాపురించిందన్నారు.రైతుల సమస్యలపై రాజకీయం చేసే అవసరం లేదన్నారు.రైతుల పంట పొలాలు ఎండిపోకుండా చలివాగు ఆయకట్టు వెంట చిట్యాల,రేగొండ, మొగుళ్ళ పల్లి, టేకుమట్ల వరకు వరి పంట పొట్ట దశలో ఉందని అందరూ రైతులే ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకొని చలివాగు తూము ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలనీ డిమాండ్ చేశారు.డిబిఎం 38 ద్వారా రావలసిన నీటి వాట మాకు రావడం లేదని ఎగువన ఉన్న రైతులే ఎక్కువ నీటిని వాడుకోవడం వల్ల మాకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిబిఎం 38 ద్వారా గోరికొత్తపల్లి వరకే నీళ్లు వస్తున్నాయన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నపుడు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల సహాయంతో చిట్యాల,టేకుమట్ల వరకు నీటిని తీసుకెళ్ళి చిన్న చిన్న చెరువులని నింపి మత్తడి స్థాయి వరకు తీసుకెళ్ళం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాయంపేట గోవిందపూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గాదే రాజేందర్, దాసి శ్రావణ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ ధైనంపల్లి సుమన్ మాజీ ఎంపిటిసి గడిపే విజయ్ టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారేపల్లి నంధం, మండల యూత్ అధ్యక్షులు మారపల్లి మోహన్, ధైనం పెల్లి సుమన్ శాయంపేట, గోరికొత్తపల్లి,రేగొండ,చిట్యాల, మొగుళ్ళపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణానికి చాలా డేంజర్..?



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**
జన్యుమార్పిడి ఆహార పంటలు పర్యావరణానికి చాలా డేంజర్. ఎందుకంటే అది పర్యావరణంపై ఎలాంటి ఎఫెక్ట్ చూపుతుందో ఊహించడం కష్టం. సంప్రదాయ మొక్కలకు సమస్య. కానీ మారుమూల ప్రాంతాల్లో విత్తనోత్పత్తి కోసమంటూ రహస్యంగా ప్రయోగాలు చేస్తుండడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ములుగు జిల్లా వెంకటాపూర్ పరిసరాల్లో మొక్కజొన్న సాగు జోరుగా సాగుతోంది. ఇప్పుడు దిగుబడి రాక సీడ్ ఆర్గనైజర్ చేతులెత్తేయడంతో మ్యాటర్ మొత్తం బయటపడింది. ఈ మొక్కజొన్న సాగు చుట్టూ ఎన్నో డౌట్లు అలాగే ఉన్నాయి. జవాబులే రావాల్సి ఉంది.ఈ మొక్కజొన్న పొత్తుల్ని చూడండి.. ఇది సీడ్స్ ఉత్పత్తి కోసమంటూ ఏజెన్సీ ఏరియాల్లో పండిస్తున్న పంట. సీడ్స్ కోసం పత్తి అయినా మరొకటైనా రైతులతో ఒప్పందాలు చేసుకుని పండించడం ఒకెత్తు. కానీ ఇక్కడ మాత్రం ఇవేవీ లేవు. అంతా సీక్రెట్. సీడ్స్ తేవడం, స్థానిక రైతులకు పండించాలని చెప్పడం, పంట మొత్తం కొంటామని నమ్మించడం ఇదే జరుగుతోంది. ఇప్పుడు దిగుబడి రాక సీడ్ ఆర్గనైజర్ అడ్రస్ లేకుండా పోవడం రైతులు రోడ్డెక్కడంతో కార్న్ సీడ్స్ చుట్టూ డార్క్ సీక్రెట్స్ అన్నీ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి.గద్వాల్, ఉమ్మడి మహబూబ్ నగర్ ఏరియాల్లో అక్కడక్కడ కాటన్ సీడ్స్ కోసం పంట పండిస్తుంటారు. కానీ ములుగు జిల్లాలో మాత్రం మొక్కజొన్న సీడ్స్ కోసమంటూ ప్రయోగాలు చేస్తున్నారా.. లేకుంటే ఇది జన్యుమార్పిడి మొక్కజొన్న పంటా అన్నది కీలకంగా మారింది. ఎందుకంటే జన్యుమార్పిడి ఆహార పంటలు పండించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు తీసుకోవాలి. ఇష్టంవచ్చినట్లు చేయడానికి వీల్లేదు. ఎందుకంటే జీన్ మోడిఫైడ్ సీడ్స్ తో బయో డైవర్సిటీకి ముప్పు ఉంటుంది. మనం తినే ఫుడ్స్ లో మారిపోయి అది ఆరోగ్యంపై ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుందో అంచనా వేయడం కష్టం. అందుకే వీటి అనుమతుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.మెయిన్ క్వశ్చన్ ఏంటంటే.. ములుగు ఏరియాలో పండిస్తున్న మొక్కజొన్న క్రాప్ జెనెటికల్లీ మోడిఫైడా కాదా అన్నది ఒకటి.. సీడ్స్ కోసమే పండిస్తున్నారా అన్నది ఇంకొకకటి. ఒకవేళ సీడ్స్ కోసమే పండిస్తే అనుమతులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు ఎక్కడ? ఒకవేళ జన్యుమార్పిడి విత్తనాలను నేరుగా తీసుకొచ్చి సాగు చేయిస్తుంటే ఆ అనుమతులు ఏవి? అన్నది కీలకంగా మారాయి. ములుగు ఏరియాలో సాగవుతున్న మొక్క జొన్న క్రాప్ చుట్టూ సవాలక్ష డౌట్లు పెరుగుతున్నాయి. ఒక్కసారి ఈ విత్తన బ్యాగ్ చూడండి.. దీనిపై పేరు లేదు ఊరు లేదు. జస్ట్ ఒక కోడ్ మాత్రమే ఉంది. ఇది కూడా పెద్ద డౌట్. రైతులు చెబుతున్నదాని ప్రకారం ఈ సీడ్స్ అన్నీ విదేశాల నుంచే వస్తున్నాయంటున్నారు. అదే జరిగితే క్వారంటైన్ ఎటు వెళ్లింది.. చెకింగ్స్ ఏమి చేశారు.. ఇక్కడిదాకా ఎలా వచ్చాయి అన్నది కీలకంగా మారుతున్నాయి.అడ్రస్ లేకుండా వెళ్లిన సీడ్ ఆర్గనైజర్స్ ను పట్టుకుంటేనే అసలు నిజాలు తెలుస్తాయంటున్నారు. నిజానికి బీటీ కాటన్ చాలా మందికి తెలుసు. గతంలో పత్తి దిగుబడులు రాక చీడపీడల కారణంగా రైతులు చాలా నష్టపోయే వారు. కానీ బీటీ ఎప్పుడైతే ఎంటర్అయిందో పత్తి దిగుబడులు పెరిగాయి. చీడపీడల బాధలు తప్పాయి. బీటీ అంటే బాసిల్లస్ థురెంజియెన్సిస్. ఇందులో క్రై2 ఏసీ అనే జన్యువు కీలకంగా ఉంటుంది. ఇది పత్తిని ఆశించే పురుగు పత్తి ఆకును తినగానే చనిపోయేలా చేస్తుంది. విషపూరితం అన్న ఇది వాణిజ్య పంట అయిన పత్తికి వర్కవుట్ అయింది. అదే ఆహార పంటల్లో ఇలా జన్యుమార్పిడి చేస్తే అది తినే జనాలు, పశు పక్ష్యాదులపై ఎలాంటి డేంజర్ ఎఫెక్ట్ చూపుతుందన్నది క్వశ్చన్ మార్క్. అందుకే వీటి అనుమతులు అంత సులువుగా రావుకానీ మొక్కజొన్నపై చాలానే కుట్రలు జరుగుతున్నాయనడానికి ఇదొక ఎగ్జాంపుల్ మాత్రమే. గతేడాది తమిళనాడులో కూడా ఈ జన్యుమార్పిడి మొక్కజొన్న క్రాప్ చుట్టూ పెద్ద రగడే నడిచింది. 2021 మార్చిలో మొక్కజొన్న సహా 24 ఆహార పంటలను దిగుమతి చేసుకోవడానికి జీఎం ? ఫ్రీ సర్టిఫికెట్ తప్పనిసరి చేసింది. ఒక పంట జన్యుమార్పిడా కాదా అన్నది పాలిమరేజ్ చైన్ రియాక్షన్ పద్ధతిలో తెలుస్తుంది. ఇటీవలే నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ సైంటిస్టులు సమర్పించిన జర్నల్ లో భారత్ లో మొక్కజొన్న ప్రాసెస్డ్ ఫుడ్ ఐటమ్స్ లో జన్యుమార్పిడి చేసిన ఆనవాళ్లను గుర్తించారు. జీఎం పాజిటివ్ వచ్చింది. ఇది ఆందోళనపరిచే విషయం. ఇదే సీన్ ములుగు జిల్లా ఏజెన్సీలో రిపీట్ అయిందా అన్నది శాంపిల్స్ టెస్ట్ చేస్తేనే బయటకు వస్తుందంటున్నారు. ములుగు జిల్లాలో బీటీ మొక్కజొన్న సాగు చేస్తున్నామన్న విషయం అక్కడి గిరిజన రైతులకు కూడా తెలియదు. కొన్ని విత్తన కంపెనీల పేర్లతో కొంతమంది ఆర్గనైజర్లు, ఏజెంట్లు వేసిన ఉచ్చులో పడ్డారు అక్కడి అమాయక రైతులు. మొక్కజొన్న విత్తనాలను సాగు చేస్తే ఎకరాకు 4టన్నుల పంట దిగుబడి వస్తుందని.. భారీగా ఆదాయం వస్తుందని ఆశ చూపించడంతో.. దాదాపు 5 నుంచి 6 వేల ఎకరాల్లో విత్తనాల కోసమే మొక్కజొన్న సాగు చేశారు అక్కడి రైతులు. కానీ పంట కోసే సమయానికి చూస్తే.. కనీసం ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అంతేకాదు.. ఇక్కడ బీటీ సాగు చేస్తున్నారేమో అన్న అనుమానాలను బలపరచడానికి మరికొన్ని సాక్ష్యాలు కనిపిస్తున్నాయి.విత్తన కంపెనీలకు చెందిన ఆర్గనైజర్లు, ఏజెంట్లు.. రైతులతో మాట్లాడి ఇదిగో ఈ విత్తనాలను నాటించారు. కానీ అధికారికంగా ఎలాంటి అగ్రిమెంట్లు చేసుకోలేదు. రాతపూర్వకంగా ఏ కంపెనీ విత్తనాలను ఇస్తున్నారు.. ఎలా సాగు చేయాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎంతకు పంటను కొంటారన్నది లేదు. పైగా రైతులకు విత్తనాలను సరఫరా చేసిన ప్యాకెట్లపై ఏ కంపెనీ పేరు గానీ, సింబల్ గానీ లేదు. కేవలం కొన్ని కోడ్ నెంబర్లు వేసిన తెల్ల సంచుల్లో విత్తనాలను ప్యాక్ చేసి ఇచ్చారు. ఏజెంట్ల మాటలు నమ్మి సాగు మొదలుపెట్టేశారు. కంపెనీ పేర్లను చెప్పి.. పొలాల్లో బోర్డులు కూడా పెట్టలేదు. గిరిజన ప్రాంతాల్లో అదీ చదువు అసలే రాని రైతుల పొలాల్లోనే ఎందుకు వీటిని సాగు చేస్తున్నారు? దిగుబడి రాలేదని తెలిశాక.. విత్తనాలు సరఫరా చేసిన ఏజెంట్లు, ఆర్గనైజర్లు ఎందుకు పరారయ్యారు?ఈసారి మొక్కజొన్న పొత్తుకు గింజలు రాకపోవడంతో ఏజెంట్లు పంట కొనలేదు. నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రైతుల ఆందోళన చేయడంతో మ్యాటర్ అంతా బయటకు వచ్చింది. సంప్రదాయ విత్తనాల తయారీ రైతుల చేతి నుంచి ఎప్పుడో బడా కంపెనీల చేతిలోకి వెళ్లిపోయింది. గతంలో రైతులు విత్తును దాచుకునే వారు. కానీ ఇప్పుడు కంపెనీలు అమ్మినవే కొనే పరిస్థితి వచ్చింది. అయితే చాలా కంపెనీలు డైరెక్ట్ గా రంగంలోకి దిగకుండా దొంగచాటుగా ప్రయోగాలు చేస్తూనే ఉన్నాయి. జీవ వైవిధ్యాన్ని ప్రభావితం చేసేలా ఏ ప్రయోగం చేసినా సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని బయోలాజికల్ డైవర్సిటీ చట్టం 2002 చెబుతోంది.ఇప్పుడు ప్రశ్న ఏంటంటే సీడ్ ఆర్గనైజర్ ఎవరు.. ఏ కంపెనీ కోసం పని చేస్తున్నారన్నది తేలాలంటున్నారు. ఇల్లీగల్ జీఎం అయితే పర్యావరణానికి ప్రమాదమని గుర్తు చేస్తున్నారు. ఇది విత్తన చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఇలా విత్తనాల కోసమే పంటలు సాగు చేయిస్తుంటే రిజిస్టర్ చేసుకోవాలి. అప్పుడు రైతులకు పక్కాగా నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి రిజిస్ట్రేషన్ లేకుండా, కాంట్రాక్ట్ లేకుండా ఆర్గనైజర్స్ రంగంలోకి దిగుతుంటారు. అటు విత్తన కంపెనీలు కూడా డైరెక్ట్ గా రైతులతో డీల్ చేయవు. మధ్యవర్తులను రంగంలోకి దింపుతాయి. బయోడైవర్సిటీ చట్టం ప్రకారం ఉల్లంఘనలు రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, 5 లక్షల జరిమానా ఉంటుంది. ఇది ఎంత లెక్క. అందులోనూ దీన్ని నిరూపించి చట్టం ముందు పెట్టే పరిస్థితి ఉందా?

## కన్నడ మంత్రికి రన్యారావుతో లింక్...

**బెంగళూరు, తెలంగాణ ముచ్చట్లు :**
బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ నటి రన్యారావు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ అంశంపై కర్ణాటక అసెంబ్లీలో రచ్చ రచ్చ జరిగింది. అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయిన నటి రన్యారావు వెనుక ఉన్న మంత్రి ఎవరే విషయంపై తీవ్ర కలకలం రేగింది. ఆమె వెనుక ఉన్నది ఎవరో బహిర్గతం చేయాలంటూ సభలోని బీజేపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో కొద్ది సేపు తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. ఈ కేసు గురించి తనకు ఎటువంటి సమాచారం లేదని హోంమంత్రి చెప్పడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మండిపడ్డారు. నటి రన్యా రావు కేసుకు సంబంధించి, బంగారం స్మగ్లింగ్ వెనుక ఉన్న మంత్రి ఎవరు? అని బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సభలో ప్రశ్న లేవనెత్తారు. అయితే ఈ ప్రశ్నకు సమాధానం చెబుతూ.. హోంమంత్రి పరమేశ్వర తనకు తెలియదని చెప్పడంతో ఒక్కసారిగా సభలో వివాదం చెలరేగింది.అయితే సభలో మంత్రి ఎవరో చెప్పకపోయినా.. బంగారం అక్రమ రవాణా వెనుక బడా నేత ఉన్నట్లు సమాచారం. ఆదివారం ఈ కేసు వెనుక మంత్రి ఉన్నారని బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం కూడా ఇదే అంశం సభలో లేవనెత్తడంతో గందరగోళం చోటు చేసుకుంది. అసెంబ్లీ జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన కర్కల బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, బంగారం అక్రమ రవాణాకు పోలీసులే ప్రోటోకాల్ ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. దీని వెనుక మంత్రి ఎవరో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీనిపై హోంమంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ.. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని అన్నారు.ఈ కేసు గురించి మీకు ఎంత తెలుసో, తమకూ అంతే తెలుసని అన్నారు. ఆ మంత్రి ఎవరో సీబీఐ కనుక్కోవాలని ఆయన అన్నారు. మంత్రి సమాధానంతో సంతృప్తి చెందని సునీల్ కుమార్ దీన్ని మీరే సీబీఐకి ఇవ్వండి అని డిమాండ్ చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి వెల్లడించారు. కానీ, బీజేపీ ఎమ్మెల్యే మాత్రం.. ఎవరినో రక్షించడానికి ఇదంతా జరుగుతుందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పీకర్ ఖాదర్ జోక్యం చేసుకుని కేసు దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. అయితే ఈ కేసులో రన్యారావు వెనుక ఒక మంత్రి ఉండి బంగారం అక్రమ రవాణా చేయించారనే ఆరోపణలు కర్ణాటక ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. అలాగే బీజేపీ అంశాన్ని బలంగా పట్టుకుంది.

## రైతులకు కన్నీరు తెప్పిస్తున్న పుదీనా

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
పుదీనా... మనం వండే ప్రతి వంటలో వాడుతుంటాం. సూపర్ మార్కెట్కు వెళ్తే ఒక్కో కట్ట రూ.10కి అమ్ముతుంటారు. చిరు వ్యాపారుల దగ్గరికి వెళ్లినా రూ.5 కి తక్కువ ఉండదు. కానీ, రైతులకు మాత్రం కట్టకు ఒక్క రూపాయి కూడా రావడం లేదు. పోనీ నిల్వ చేసుకొని తర్వాత అయినా అమ్ముకుం దామనుంచే ప్రభుత్వాలు అలాంటి ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో ధర తగ్గినప్పుడల్లా మార్కెట్లోనే పారబోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కోల్ స్టోరేజీలు ఏర్పాటు చేసి ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. మరిన్ని రైతులు బజార్లు, పుదీనా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినా కొంత మేర మేలు జరుగుతుందని అంటున్నారు. పుదీనా పంట ఎకరం, అరెకరం ఉన్న రైతులు కూడా సాగు చేసుకోవచ్చు. కానీ, అడుగు మందులు, పిచికారీ మందుల ధరలు, కూలీ రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో గిట్టుబాటు కావడం లేదు. పంట కాలం 45 రోజుల నుంచి 60 రోజులే అయినప్పటికీ... ఒక ఎకరానికి సహజ ఎరువులు (పశువుల పేడ, పౌల్ట్రీ ఎరువు) తో పాటు యూరియా, డీఏపీ లాంటి మందులు వేయాల్సి ఉంటుంది. పంటకు దోమ, పచ్చ పురుగు, నల్ల పురుగు, ఆకు తెగులు, పేను బంక తదితర రోగాలు వస్తుంటాయి.వీటి నివారణకు క్యాబ్రియో టాప్, అక్టోబట్, ర్యాపిడ్, బెంజర్, ప్రోక్లెయిమ్, అమిస్టార్, పితోరా... తదితర మందులు వాడుతుంటారు. వీటితో పాటు కలుపు, కోత కూలీల ఖర్చులు కలుపుకొని... రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ పంట కోస్తే దాదాపు 80 వేల నుంచి లక్ష కట్టలు వస్తాయి. అంటే మార్కెట్లో మినిమం కట్టకు రూ.1.50 నుంచి రూ.2 పలికితే కొంత లాభం ఉంటుంది. కానీ, ప్రస్తుతం ఒక్కో కట్ట రూ.40 పైసల నుంచి రూ. 60 పైసలు మాత్రమే పలుకుతుంది. ఈ లెక్కన ఒక్క పంటకు (రెండు నెలలు) రూ. 30 వేల వరకు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.పుదీనా పంటను సాధారణంగా చేవెళ్ల నియోజకవర్గంలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఇందులోనూ చేవెళ్ల మండలం ముడిమ్యాల, మల్కాపూర్, రావుల పల్లి , కుమ్మెర, మొయినాబాద్ మండలం తోలుకట్ట, అప్పారెడ్డి గూడ, నక్కలపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజూ కనీసం రెండు మినీ వ్యాన్ల లో హైదరాబాద్లోని గుడి మల్కాపూర్ మార్కెట్కు తీసుకెళ్తుంటారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in